ENTERED
KSR02131252

ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
జూన్ 12, 2016

స్నేహ



వివక్షపై పిడిగుద్దు



జాగ్రత్తగా...

సినిమాల్లోని ఫైట్స్, బైక్ చేజింగ్‌ల్ని చూసి యువత తెగ అడ్రినలిన్ రష్‌తో ఊగిపోతుంది. థియేటర్ బయటకొచ్చాక కూడా ఆ ఊపుతో జోరుగా బైక్ స్టంట్‌లు చేస్తూ ఇళ్లకు చేరతారు. కొంతమంది అవి ఫెయిలై ఆస్పత్రికి మారతారు లేదా ప్రాణాలే కోల్పోతారు. ఇప్పటికే బైక్ రేసుల గోలతో తల్లిదండ్రులు తెగ ఆందోళన చెందుతున్నారు. అందుకే ఎంత సినిమాల్లో ఇరగదీసినా అదంతా కూడా భద్రతతో కూడిన స్టంట్లేనని చెప్పేందుకు తారలు వెనకాడటం లేదు. హీరోయిన్ తాప్సీ పన్ను గోవాలో జరుగుతున్న తన చిత్ర షూటింగ్‌లో బైక్ స్టంట్లను జాగ్రత్తగా చేసేస్తోంది. కానీ బయట బైక్ స్టంట్లు చేస్తోన్న యువత తీరు మాత్రం దీనికి పూర్తిగా భిన్నం. రాత్రి పూట మద్యం తాగి స్పీడ్ డ్రైవ్ చేస్తున్న యువకుల్ని చూసి షాకైందట తాప్సి. యువత ఆలోచనా విధానాన్ని మార్చేందుకు రోడ్డు భద్రతపై ఒక ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించబోతోంది. ఢిల్లీ, గోవా, ముంబై లాంటి నగరాల్లో కొన్ని యాక్సిడెంట్‌లని చూసిన తాప్సి సొంత బైక్‌ని కొనుక్కోవడం మానుకుందట. ముంబై ట్రాఫిక్ పోలీసులతో కలిసి 'స్ట్రీట్ సేవ్' పేరుతో ఇప్పటికే ప్రముఖ తారలు మందిరా బేడి, సునీల్ షెట్టి, ఆమీర్ ఖాన్‌లు వివిధ సందర్భాల్లో కొన్ని ప్రచార కార్యక్రమాలని నిర్వహించారు. 2014లో ఢిల్లీలో రోడ్డు భద్రతపై నిర్వహించిన ఒక క్యాంపెయిన్‌లో సోనాక్షి సిన్హా భాగమయ్యింది. యువత బైక్ రైడ్ చేయడం మానుకొమ్మని కాదు గానీ మద్యం సేవించి, ట్రాఫిక్ రూల్స్ పాటించకుండా వాహనాలు నడపడం అతి ప్రమాదకరమనే విషయాన్ని యువతకు బాగా చేరేలా తాప్సి క్యాంపెయిన్ ఉపయోగపడుతుంది.

కథా నిలయం శ్రీకాకుళం
ENTERED KSR02B125

ఇజ్రాయిల్ ఆక్రమిత పాలస్తీనా వెస్ట్ బ్యాంక్ ప్రాంతంలో ఓ పసిమొగ్గ అగ్ని కణంలా రగిలిపోతోంది. నబీ సలేహ్‌లో పుట్టిన ఆ జ్వాల కార్చిచ్చులా పాలస్తీనా విప్లవం అంతటా వ్యాపిస్తోంది. జన్నా జీహాద్ అని ప్రపంచానికి పరిచయం చేసుకుంటూ ఇజ్రాయిల్ మూక దౌర్జన్యకాండను ఎప్పటికప్పుడు రిపోర్ట్ చేస్తోంది. రాకెట్లు, గ్రెనేడ్‌లు ఈ సాహస జర్నలిస్ట్ అందిస్తోన్న ఫుటేజ్‌లను నిలువరించలేకపోతున్నాయి. ప్రపంచానికి కఠిన వాస్తవాలను చెప్పాలనే కాంక్షతో చిరు ప్రాయంలోనే దుస్సాధ్యమైన బాధ్యతల్ని మోస్తున్న ఈ అగ్ని కణం జ్వలించి జ్వలించి అగ్ని పర్వతంలా బద్దలైతే..! ఏమో? అగ్ని కణంగా ఉన్నపుడే సెగ ఎగేస్తోంది.

ఎనిమిదేళ్ల సాహస రిపోర్టర్

పాలస్తీనా-ఇజ్రాయిల్ సంక్షోభం వల్ల ఎపుడూ భయానక యుద్ధ వాతావరణాన్ని తలపించే ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్ ప్రాంతంలోనిది నబీ సలేహ్. మొత్తం 536 మంది స్థానికులు. కానీ దగ్గరలోనే ఇజ్రాయిల్ సెటిల్‌మెంట్ ఉంది. ఇజ్రాయిల్ సైనికుల అండతో రోజు రోజుకు ఈ ప్రాంతంలోకి చొచ్చుకుని రావడం, కాల్పులు, రాకెట్, గ్రెనేడ్ దాడులు పెచ్చుమీరడంతో ఆత్మరక్షణలో పడ్డారు పాలస్తీనీయులు. అల్లరి మూకకు తోడు ఇజ్రాయిల్ సైనికులూ దాడులకు పాల్పడుతుంటారు. అలాంటి చోట ఏం జరుగుతోందనేది అగ్ర రాజ్యాల మీడియా ద్వారా ప్రపంచానికి ఎంత తెలిసేది. అందుకే ఒక పార్శ్వాన్ని మాత్రమే బయటి ప్రపంచం చూడగలుగుతోంది. కానీ అక్కడ రోజురోజుకు పెరుగుతోన్న బాంబ్ దాడులు, దయనీయంగా మారుతున్న పరిస్థితులు, చిన్నారుల చావులు, శరణార్థి బతుకులు గురించి ఎవరు చెబుతారు. ఇక్కడ జరుగుతోంది చాలా దారుణమనే విషయాన్ని ఎవరు గొంతు పెగలుస్తారు. చిన్నారి జన్నా జీహాద్ ఆ సాహసాన్ని చేసింది. తమ ప్రాంతంలో జరుగుతున్న ప్రతి ఆందోళనని, అన్యాయాన్ని చిత్రీకరించి సామాజిక మాధ్యమాల ద్వారా బయటి ప్రపంచానికి చేరవేస్తోంది. లైవ్ ఫీడ్‌ను అందిస్తూ కఠోర వాస్తవాల్ని లోకం కళ్లారా చూసేలా చేస్తోంది. ఇజ్రాయిల్ దమనకాండను వెలుగులోకి తెస్తోంది. స్వేచ్ఛ, స్వాతంత్ర్యాల కోసం నినదిస్తోంది. ఇజ్రాయిల్ సైనికుల మార్చ్‌కు కెమెరాతో అడ్డుపడి వారి దుశ్చర్యలను ప్రశ్నిస్తూ గర్జిస్తోంది. జన్నాను అంతగా ప్రేరేపించిన విషయం ఆమెకు ఏడేళ్లున్నపుడు జరిగింది. దశాబ్దాల కాలం నుంచి అటు ఇస్రాయెల్, ఇటు పాలస్తీనా హింసాకాండతో జన సామాన్యం అతలాకుతలమైంది. ఎన్నో సరిహద్దు గ్రామాలు చెరిగిపోయాయి. కొన్ని ప్రాంతాలు ఎటూ కాక క్షణం క్షణం ప్రాణ భయంతో గడగడలాడుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల మధ్య జన్నా పెరిగింది. ఎపుడు బాంబ్ దాడులు జరుగుతాయో ఎపుడు సైనిక చర్య మొదలవుతుందో తెలీదు. ఈ దాడుల్లోనే జన్నా స్నేహితుడు ఇజ్రాయిల్ సైనికుల కాల్పులకు బలయ్యాడు. రోజూ జన్నాతో కలిసి ఉండే మిత్రుడు కళ్లెదుటే రక్తంలో పడి ఉండటాన్ని చూసి ఆమె చలించిపోయింది. తన బాధను, భావనల్ని ఒంటరిగా కూర్చుని ఓ పుస్తకంలో రాసుకునేది. ఈ ఘటన నుంచి తేరుకోక ముందే మరో ఇద్దరు బంధువులు ముస్తాఫా తమీమీ, రష్దీ తమీమీ కూడా సైనిక దాడిలో ప్రాణాలు కోల్పోవడంతో ఆమె భయకంపితమైంది. జ్వరంతో రాత్రుళ్లు నిద్ర పోయేది కాదు. తన భయాల్ని, ఆలోచనల్ని పుస్తకంలోకి తర్జుమా చేసేది. జన్నాలోని ఈ లక్షణాన్ని గుర్తించిన తల్లి నవాల్ ఆమెలోని అంతర్గతంగా సాగుతోన్న సంఘర్షణను వ్యక్తపరిచే బలాన్నిచ్చింది. కూతురికి ఐఫోన్‌ను ఇచ్చి తన భావాల్ని రికార్డు చేసుకోమని చెప్పింది. అదే ఐఫోన్‌ను జన్నా బయట జరుగుతోన్న నిరసన కార్యక్రమాల్ని చిత్రీకరించడం కోసం ఉపయోగించింది. ఆ ఫుటేజ్‌ను ఫేస్‌బుక్, యూట్యూబ్ తదితర సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేస్తోంది. దీనికి చుట్టుపక్కల విప్లవకారుల నుంచి విశేష స్పందన లభించడంతో ఎప్పటికప్పుడు రిపోర్టింగ్ వీడియోల్ని పోస్ట్ చేస్తోంది. అలా ఓ రిపోర్టర్ వృత్తిని తనకు తానే స్వీకరించింది. దృశ్యాలకు తన వ్యాఖ్యానాన్ని జోడించి నబీ సలేహ్‌లో వాస్తవంగా ఏం జరుగుతోందో వివరించడం మొదలెట్టింది. 2014 నాటికే ఆమె ఫుటేజ్‌లు ప్రపంచాన్ని విస్మయపరిచాయి. కేవలం తన ఒక్క గ్రామానికే పరిమితం కాకుండా తల్లితో కలసి జెరూసలెం, హెబ్రాన్, నాబ్లస్, జోర్డాన్‌లలో పర్యటించి అక్కడ నుంచి రిపోర్ట్‌లను ఆన్‌లైన్‌లో పోస్ట్ చేస్తోంది. జన్నా ఎంత సాహసాన్ని ప్రదర్శిస్తున్నా తల్లి మాత్రం భయపడుతోంది. ఎప్పుడు దళాలు తమ ఇంటిలోకి చొరబడి టియర్ గ్యాస్ ప్రయోగించి కూతుర్ని తమ నుంచి లాక్కెళ్లిపోతాయోనని, వీడియోలు తీస్తున్న సందర్భంలో ఏ తూటా జన్నా ప్రాణాల్ని తీసుకెళ్లిపోతుందోనని ఆందోళన చెందుతోంది. ఎందుకంటే ఇటీవల ఇజ్రాయిల్ సైనికులు చిన్నారుల్ని కూడా యుద్ధ ఖైదీలుగా తల్లిదండ్రులకు చెప్పకుండా కారాగారాలకు తరలిస్తున్నారనే వార్తలు తీవ్రమవుతున్నాయి. పసిమొగ్గలపై దేశ ద్రోహం, హత్యాభియోగాలు మోపి కఠిన శిక్షలు అమలు చేస్తున్నారనే కథనాలు ఆ దేశ వాసుల్లోనే వ్యతిరేకత కలిగిస్తోంది. ఇలాంటి వార్తలు వింటున్నా జన్నా మాత్రం తన పనిని కొనసాగిస్తూనే ఉంది. హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో జర్నలిజం చదివి ఏ అగ్ర మీడియా సంస్థలైతే తమకు జరుగుతోన్న అన్యాయాన్ని పట్టించుకోవడం లేదో ఆ సంస్థల ద్వారానే వృత్తిని కొనసాగించి అసలైన పాలస్తీనా కథను చెబుతానని అంటోంది. ఆమె చెబుతోన్న కథను ప్రస్తుతం లక్ష మంది పైగా ఫేస్‌బుక్‌లో ఫాలో అవుతున్నారు.. యూట్యూబ్‌లో వీక్షిస్తున్నారు.

\- జే

ఇండెక్స్

స్టార్...............3
'కిస్ ఆఫ్ లైఫ్'

స్ఫూర్తి.............. 4
న్యూరోలైఫ్ 'గౌరవ'ం

కార్టూన్ పంచ్......... 5

వింతలోకం..................10
62 అడుగుల జుట్టు

వినూత్నం...............11
రోబో లాయర్

కొత్త పుస్తకాలు...............14
జీవితం పుస్తకం తెరిస్తే...

జాతి వివక్షపై పిడిగుద్దు

అట్టమీది కథ...6

సేవ - 12
'దండి' యాత్ర

ప్రత్యేకం..................15
పెళ్ళి కానుకగా పది వేల చెట్లు

ఆదర్శం 16
లెక్కల మాస్టారి నీటి లెక్క

కథ...............18
రేయ్

రుచి....................21
మంగళూర్ స్పెషల్స్

బాల నేస్తాలు.............23
వింత పక్షి

పద వికాసం.........24

ఎన్నెన్ని అద్భుతాలో

ఎవరెస్ట్ పర్వతారోహణలో అవాంతరాలు, సరిహద్దు ప్రాంతాలపై వెలసిన నిర్మాణాలు ప్రత్యేకంగా ఆకర్షించాయి. లోహ శిల్పాల మాయలకు మైమరచి తిలకించాం. దళితులపై ఇప్పటికీ కొన్ని గ్రామాల్లో మోతుబరులు విధిస్తున్న ఆంక్షలకు నిదర్శనం బాపూరావు జలయజ్ఞం. స్టీవో, చానెల్ జంట ప్రపంచ పర్యటనలో కొత్త కోరికలు వింతగొలిపాయి. ఆటో డ్రైవర్ అబ్దుల్ ఖదీర్ నిజాయితీ, మంచితనం యువతకు స్ఫూర్తిదాయకం. నీటిలో కచేరి, టోంగ్ కొత్త చిత్రం, రిబాస్ వెరైటీ నృత్యం వింత ఆలోచనలకి పరాకాష్ట. న్యూరో సర్జన్ అరుణ్ కుమార్ గారి పరిచయం ఒక అపురూపమైనదిగా మదిలో నిలిచిపోయింది. స్నేహలో ఇన్ని అద్భుతాలు ఆకట్టుకున్నాయి.

- టి. సత్యనారాయణ మూర్తి, విశాఖపట్నం

ఎవర్‌లాస్ట్ ఎవరెస్ట్

ఎవరెస్ట్ అధిరోహకుల సాహసం, ఖ్యాతి, అవరోధాలు, విజయ గాథలతో కూడిన సమగ్ర సమాచారం ఎవర్‌లాస్ట్ ఎవరెస్ట్ ఆద్యంతం చదివించింది. నచ్చిన ప్రదేశాలను వీక్షించే పర్యాటకులే కాదు మనసు పరుగులు తీసిన ప్రదేశానికి చేరుకునే ఔత్సాహికులు చానెల్,

స్టీవోల టూర్ విశేషాలు బాగున్నాయి. స్పీడ్ రేసర్, న్యూరో అరుణం బాగున్నాయి. కార్టూన్ పంచ్, జోక్స్ నవ్వు తెప్పించాయి.

- డి. స్వేచ్ఛ, ఒంగోలు

ఆకట్టుకున్న 'వదల బొమ్మాళి'

మానవ జీవితంలో టి.వి. ఒక భాగమైందనడానికి సాక్ష్యంగా నిలిచింది వదల బొమ్మాళి కథ. ఇంటిలోని వస్తువులలో ప్రథమ స్థానం ఆక్రమించుకున్న టి.వి. సమాచార వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తూ, శాస్త్ర సాంకేతిక రంగాల సమాచారాన్ని మనకందిస్తోంది. క్రికెట్ అభిమానులకు టి.వి.కి ఉన్న సంబంధాన్ని వివరించక్కర్లేదు. అయితే టి.వి.లో ప్రసారమయ్యే అంశాల్లో వ్యాపార సంస్కృతి ఎక్కువగా ఉన్నందున వస్తు వ్యామోహం పెరిగింది. సీరియల్స్‌లోని భాష, భావం, విష సంస్కృతిని పెంచుతున్నాయి. ఇవి హింస, అరాచకాలకు నిలయంగా వున్నాయి. వీటికి చరమ గీతం పాడి ప్రగతిశీల మార్పుల కోసం ఉద్యమించాలి.

- తుంపాల శ్రీరామ మూర్తి, గాజువాక

పవన శిల్పాలు బాగున్నాయి

చెరిగిన సరిహద్దులు ఎంతో ఆకట్టుకున్నాయి. సరిహద్దులు లేకుండా కలిసిమెలిసి జీవించడం నిజంగా అద్భుతం. సినీ ఫీల్డులో అన్ని రకాల పాత్రలను పోషించగలిగితేనే నిలదొక్కుకోగలుగుతారు. స్టంట్ హీరోయిన్లు, అలీషా అబ్దుల్లా స్పీడ్ రేసర్‌గా గుర్తింపు పొందడం మహిళాలోకానికి గర్వకారణం. న్యూరో వైద్యంతో ఎంతో మంది ప్రాణాలు కాపాడుతున్న డా. అరుణ్ కుమార్‌గారికి అభినందనలు. ఎవరెస్టు ఎక్కి కీర్తి పతాకం ఎగురవేసినవారు, అక్కడి వాతావరణం అనుకూలించక ప్రాణాలు కోల్పోయినవారు ఎవర్‌లాస్ట్ ఎవరెస్టు అధిరోహకులు. 'భార్య కోసం బావి తవ్వాడు' అగ్రకుల అహంకారం ఉన్నవారికి గుణపాఠం కావాలి. నేటి కుటుంబాల్లో టి.వి. ప్రభావం ఎంతగా ఉందో వివరించిన వదల బొమ్మాళి కథ బాగుంది.

-బొడ్డేపల్లి కనకలక్ష్మి, ఆమదాలవలస

సంచికపై మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా: స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 27-30-4,
ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ.-520002.
మెయిల్ అడ్రస్ : snehaweekly.praja@gmail.com

‘కిస్ ఆఫ్ లైఫ్’

ఇమ్రాన్ హష్మీ

‘కిస్ ఆఫ్ లైఫ్’ అంటే శ్వాస ఆగిపోయి మరణం అంచున ఉన్నవారికి ఊపిరిలూది ప్రాణాన్ని నిలబెట్టేది. బాలీవుడ్ హీరో ఇమ్రాన్ హష్మీకి అంత ప్రాణం పోయే పరిస్థితి ఏమొచ్చింది. ఊపిరాగేంత సమస్య నుంచి ఎవరు బయట పడేశారు. రెండిటికీ సమాధానం ఆయన నాలుగేళ్ల కొడుకు అయాన్. అతడికి క్యాన్సర్ అని తేలడంతో ఇమ్రాన్ ఊపిరాడక సతమతమయ్యాడు. అయాన్ క్యాన్సర్‌తో పోరాడి గెలవడంతో ఇమ్రాన్‌కు ప్రాణం లేచొచ్చింది. అందుకే ఆ జీవితంపై రాసిన పుస్తకానికి ‘కిస్ ఆఫ్ లైఫ్’ అని పేరు పెట్టుకున్నాడు. దాని గురించి కొన్ని వివరాలు..

ప్రముఖ బాలీవుడ్ రచయిత బిలాల్ సిద్దిఖీతో కలసి ఈ పుస్తకాన్ని రాశాడు ఇమ్రాన్ హష్మీ.

- చిన్నారులు ప్రాణాంతక క్యేన్సర్ బారిన పడితే ఇమ్రాన్‌లా మిగతా తల్లిదండ్రులు ఎలా ఎదుర్కోవాలనే ఉద్దేశంతో ఈ పుస్తకాన్ని రచించాలని బిలాలే ఇమ్రాన్‌ను కోరాడు.
- సరిగ్గా నెల క్రితం విడుదలైన ఈ పుస్తకానికి విశేష స్పందన వచ్చింది. ఆంగ్లంలో ఉన్న దీన్ని ఇప్పుడు హిందీలో, మరాఠిలో కూడా తెచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.
- మొత్తం 14 అధ్యాయాలున్న ఈ పుస్తకంలో ఇమ్రాన్ జీవితంతో పాటు అయాన్ క్యేన్సర్ పోరాటం వరకు జీవితంలో ముఖ్య ఘట్టాలన్నింటినీ వివరించాడు.
- కామర్స్ డిగ్రీతో బయటకొచ్చి చేతి మసాజ్ పరికరాలను అమ్మే సేల్స్‌బోయ్ జీవితం నుంచి సినీ కెరీర్‌లో ఎలా అడుగిడింది తెలిపాడు.
- విక్రమ్ భట్ తీసిన ‘ఫుట్‌పాత్’ (2003)లో ఓ లైన్ డైలాగ్ పలికేందుకు 45 టేక్‌లు తీసుకున్నాడట. కానీ జీవితంలో కొన్ని విషయాల్లో రీటేక్‌లకు అవకాశం ఉండదని, ఒక వేళ ఉంటే అది జీవితాన్ని మార్చేసేంత గొప్ప బహుమతి అని అంటాడు.
- 2014 జనవరిలో అయాన్ కిడ్నీలకు విల్మ్ ట్యూమర్ రెండో స్టేజ్‌లో ఉందని తేలింది. ఇది ప్రాణాంతకం కావడంతో శస్త్ర చికిత్స తప్ప వేరే అవకాశం లేదని వైద్యులు చెప్పారు.
- కెనడాలో ఆరు నెలల పాటు కీమోథెరపీ తీసుకున్న అయాన్‌తో నేరుగా మాట్లాడేందుకు గొంతు పెగలక కామిక్ హీరో ‘బ్యాట్‌మేన్’లా మాట్లాడేవాడు ఇమ్రాన్. బ్యాట్‌మేన్‌లా అయాన్‌మేన్ అనే సూపర్ హీరోగా చూడాలని కొడుకును అడిగేవాడు.
- అయాన్‌కు బ్యాట్‌మేన్ అంటే చాలా ఇష్టం. ఇంట్లో ఆ దుస్తులు వేసుకుని తానో సూపర్ హీరో అనుకుంటూ తిరిగేవాడు.



- అయాన్‌కు రెండేళ్లున్నపుడు ఆహారం, పాలు తీసుకోవడం లేదని ఇమ్రాన్ బ్యాట్‌మేన్ కేరెక్టర్ సాయం తీసుకున్నాడు. నువ్వు మంచిగా తిండి తింటే నువ్వూ సూపర్ హీరోవి అయిపోతావ్ అని అయాన్‌కు చెప్పేవాడు.
- అయాన్ ఓసారి పాఠశాల పరుగు పోటీల్లో నీరసంతో కూలబడ్డాడు. కానీ తిరిగి లేచి, మళ్లీ పడి, మళ్లీ నిలదొక్కుకుని అలా చివరకు రేస్ పూర్తి చేశాడు. అది తానూ బ్యాట్‌మేన్‌లా సూపర్ హీరోనని అయాన్ నమ్మడం వల్లే.
- కామిక్ హీరోల్ని సృష్టించడానికి కారణం అప్పుడు తెలుసుకున్నాడట ఇమ్రాన్. అదే విషయాన్ని తన జీవితంలోను, కెరీర్‌లోను స్వీకరించాడు. తన కొడుకులా ఎన్నిసార్లు పడిపోయినా తిరిగి లేచి రేసు పూర్తి చేయాలనే కాంక్ష ఆ రోజే రగిలింది. అదే కొండంత బలంగా కనిపించింది.
- తన కొడుకును బతికించుకోవాలన్న కాలంలో మొత్తం ప్రపంచమంతా స్తంభించిపోయినట్టు ఉండేదట. కెరీర్, హిట్‌లు, ఫ్లాప్‌లు ఇలా ఏదీ కూడా పట్టనట్టుగా ప్రపంచం మూగబోయేదట.
- ‘మిస్టర్ ఎక్స్’, ‘రాజా నట్వర్‌లాల్’ చిత్రాల షూటింగ్ కోసం కెనడాలో అయాన్‌ను వదిలి ముంబైకు రావాల్సి వచ్చింది ఇమ్రాన్‌కు. రెండు వారాలపాటు ఇమ్రాన్‌కు నిద్ర పట్టక నిద్ర మాత్రలు వాడాడు. ఎంత వృత్తిలో లీనమయ్యేందుకు ప్రయత్నించినా పావుగంట కూడా కొడుకు ఆలోచన లేకుండా ఉండలేకపోయాడు. ఇలా 3 నెలలు చిత్రవధకు లోనయ్యాడు.
- క్యేన్సర్‌ను జయించిన అయాన్ ఇప్పుడు చక్కగా స్కూల్‌కు వెళుతున్నాడు. పరుగు పోటీలే కాదు.. కిక్ బాక్సింగ్ కూడా నేర్చుకుంటున్నాడు.

✦



ఇయాన్ బర్క్‌హార్ట్.. ఉజ్వల భవిష్యత్తు ఉన్న యువకుడు. ఆరేళ్ల క్రితం జరిగిన కారు ప్రమాదంలో వెన్నుపాము దెబ్బతింది. ఫలితంగా కాళ్లు, చేతుల్లో చలనం లేకుండా పోయింది. కాఫీ కప్పును పట్టుకోలేని పరిస్థితి. కానీ ఇప్పుడు చేతి వేళ్లను అటూఇటూ ఆడిస్తూ వీడియో గేమ్స్ ఆడుతున్నాడు. బర్క్‌హార్ట్‌కు మరో జీవితాన్నిచ్చింది 'న్యూరోలైఫ్'. ఈ సరికొత్త నాడీ సాంకేతికతకు రూపమిచ్చి అభివృద్ధి చేస్తున్నారు భారత్‌కు చెందిన సాంకేతిక నిపుణుడు గౌరవ్ శర్మ. అమెరికాకు చెందిన శాస్త్రవేత్తలతో కలిసి చేస్తున్న ప్రయోగాలు విజయవంతమైతే కదల్లేని స్థితిలో ఉన్న ఎందరినో కదిలిస్తాయి. స్తబ్దుగా ఉన్న వారి జీవితాల్లో చలనం తెస్తాయి.

న్యూరోలైఫ్ 'గౌరవ'ం

ఉత్తర ప్రదేశ్‌లోని మీరట్‌కు చెందిన డాక్టర్ గౌరవ్ శర్మ మెకానికల్ ఇంజనీర్. ప్రస్తుతం అమెరికా రాష్ట్రం ఓహియోలోని కొలంబస్‌లోనున్న బటెల్లె మెమోరియల్ ఇనిస్టిట్యూట్ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. పక్షవాతం, నరాల బలహీనతతో అవయవాల్లో చలనం లేని వారికి పూర్వస్థితి కల్పించి అందరిలా చక్కగా కదలగలిగేలా చేయాలనుకున్నారు. నాడీ వ్యవస్థకు సంబంధించిన సాంకేతికతపై నెల, రెండు నెలలు కాదు రెండేళ్ల పాటు అధ్యయనాలు చేశారు. చివరకు నాలుగు మిల్లీమీటర్ల పొడవు, వెడల్పు పరిమాణంతో ఉన్న చిన్న చిప్‌ను తయారు చేశారు. దీనికి 'న్యూరోలైఫ్' అని నామకరణం చేశారు.

తొలి ప్రయోగం

డివైస్‌కు జీవం పోయడం వరకు బాగానే ఉన్నా అదెలా పనిచేస్తుందో తేలాలంటే ప్రయోగం చేయాలి. అందుకోసం ఇయాన్ బర్క్‌హార్ట్‌ను ఎంచుకున్నారు శాస్త్రవేత్తలు. డబ్లిన్‌కు చెందిన 22 ఏళ్ల ఈ యువకుడు ఆరేళ్ల క్రితం ఉత్తర కెరోలినాలోని ఔటర్ బ్యాంక్స్ పర్యాటక కేంద్రంలో సముద్ర విహారానికి వెళ్లినపుడు ఓ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. వెన్నుపాముకు బలమైన గాయాలు కావడంతో నరాలు పనిచేయడం మానేశాయి. కాళ్లు, చేతులు కదల్చలేని స్థితిలో ఉన్నాడు. అప్పటి నుంచి బర్క్‌హార్ట్ ఫిజియోథెరపి తీసుకుంటున్నాడు. ఆరేళ్ల నుంచి మంచంపైనే ఉండడంతో ఈయనకు చిప్‌ను అమర్చి ఫలితాల్ని తేల్చాలని నిర్ణయం తీసుకుంది శాస్త్రవేత్తల బృందం. 2014లో ఓహియో విశ్వవిద్యాలయానికి చెందిన వెక్స్‌నర్ వైద్య కేంద్రం వైద్యులు దీనిని బర్క్‌హార్ట్ మెదడులోని మోటార్ కార్టెక్స్ ప్రాంతంలో అమర్చారు. ఆ ప్రాంతం చేతి కదలికల్ని నియంత్రిస్తుంది. ఎలక్ట్రానిక్ న్యూరల్ బైపాస్‌గా పిలిచే ఈ సాంకేతిక చికిత్సా విధానంలో మెదడు, అవయవాల మధ్య సంకేతాల్ని చిప్ పర్యవేక్షిస్తుంది, నియంత్రిస్తుంది. అలా వెన్నుపాముతో సంబంధం లేకుండా మెదడులోని సంకేతాల్ని రికార్డు చేసుకుని,

విశ్లేషించి కంప్యూటర్ వ్యవస్థ ద్వారా ఈ చిప్ నేరుగా చేతికి సిగ్నల్స్‌ను పంపించి ప్రేరణ తెచ్చింది. బర్క్‌హార్ట్ చేతుల్లో కదలికలు కనిపించాయి. దానికి అలవాటు పడి సరిగ్గా చేతిని కదిలించేందుకు వారానికి మూడు సార్లు అలా 15 నెలల పాటు ప్రత్యేక శిక్షణ తీసుకున్నాడు బర్క్‌హార్ట్. మిగతా వేళ్లతో సంబంధం లేకుండా ఒక్కో వేలుని, ఆరు రకాలుగా మణికట్టును, చేతిని కదిలించగలిగే స్థాయికి చేరుకున్నాడు. ఒకప్పుడు తేలికపాటి కర్ర ముక్కను అందుకోలేని బర్క్‌హార్ట్ ఇప్పుడు తనంతట తాను చొక్కా వేసుకోగలుగుతున్నాడు. బొటన వేళ్లు, చేతి మడమలను చాపడం, తిప్పడం, మోచేతులను ముడవడం, చాపడం వంటివి చేయించాలని భావిస్తున్నారు. నీళ్ల సీసాల మూతలు విప్పడం, జార్లతో నీళ్లను వాటిలో పోయించడం చేయించారు. పర్సులో నుంచి క్రెడిట్ కార్డు తీసుకుని స్వైప్ చేయగలిగే శక్తిని సంపాదించాడు. రెండేళ్లపాటు అధ్యయనం చేసి అభివృద్ధి పరిచిన ఈ సాంకేతికతలో డాక్టర్ గౌరవ్ శర్మ కీలక నిపుణులు.

నడిపించాలనీ..

తొలి ప్రయోగం విజయవంతమవ్వడంతో గౌరవ్‌శర్మ బృందంలో ఉత్సాహం మరింత రెట్టింపయ్యింది. ఇప్పుడు కాళ్లలోను కదలికలు తీసుకురావాలని భావిస్తున్నారు. ఈ సాంకేతికత ద్వారా కాలి కండరాల్లోకి సంకేతాలను పంపి రోగిని నడిపించాలనుకుంటున్నారు. దీనిని రాబోయే వేసవిలో రోగిపై ప్రయోగించడానికి రంగం సిద్ధం చేసుకున్నారు శాస్త్రవేత్తలు. ప్రస్తుతానికి ప్రయోగశాలకే పరిమితమైన ఈ వ్యవస్థను ఓ చిన్నపాటి మొబైల్ పరికరం రూపంలోకి తేవాలని ప్రయత్నాలు జరుగుతున్నాయి. రోడ్డు ప్రమాదాల్లో కావొచ్చు, అనారోగ్యంతో కావొచ్చు ఇలా అవయవాలు చచ్చుబడిపోయిన లక్షలాది మందికి ఈ న్యూరో టెక్నాలజీ గొప్ప మేలే చేయనుంది. సామాన్యులకూ అందుబాటులోకి వచ్చేలా శాస్త్రవేత్తలు కృషి చేయాలని కోరుకుందాం.

- జి.శ్రీనివాస

కార్టూన్ పంచ్



నవ్వుల్ - పువ్వుల్



ఉతుకుడు

సుందర్: నా మీద కోపం వస్తే మా ఆవిడ ఆ కోపాన్ని బట్టలుతకడంలో చూపిస్తుంది.

రాజు: మా ఆవిడ కోపంతో ఉంటే నా మీద ఉండగానే బట్టల్ని ఉతుకుతుంది..!



రాంగ్ నెంబర్

సూర్య: హలో....రవి ఉన్నడాండీ?

శ్రీను: ఆ.... ఉన్నాడు చదువుకుంటున్నాడు.

సూర్య: చదువుకుంటున్నాడా.... అయితే రాంగ్ నెంబర్ సారీ!

కిసుక్కు

అప్పారావు: సార్! నిన్న మధ్యాహ్నం అటెండర్ సుబ్బారావు పని మానేసి నిద్ర పోయాడండీ...!

మేనేజర్: మరి వెంటనే నాకెందుకు చెప్పలేదు...? (కోపంగా)

అప్పారావు: చెబుదామనే వచ్చా సార్... ఆ సమయానికి మీరూ నిద్రపోతున్నారు.

నోటు మింగేశాడు

సీత: నిన్న మా పాప రూపాయి బిళ్ల మింగేసింది.

రాధ: మరి డాక్టరు దగ్గరికి తీసుకెళ్లావా...? ఇప్పుడెలా ఉంది. (ఆందోళనగా)

సీత: హా తీసుకెళ్లాం....ఆయనో వంద నోటు మింగేశాడు.



జాతి వివక్షపై పిడిగుద్దు



మహ్మద్ అలీ... ఆ పేరు వినగానే ఓ రకమైన ప్రేరణ, ఉత్తేజం మనలో ఉప్పొంగుతుంది. ఆయన ప్రపంచ ప్రఖ్యాత బాక్సర్ మాత్రమే కాదు, వర్ణ, జాతి వివక్షలపై రాజీలేని పోరు సాగించిన యోధుడు, వియత్నాంపై అమెరికా యుద్ధాన్ని గట్టిగా వ్యతిరేకించిన ధీరుడు. అంతకు మించిన మానవతావాది. ఇరవయ్యో శతాబ్దపు మహామహులు మార్టిన్ లూథర్ కింగ్, నెల్సన్ మండేలా సరసన నిలబడగలిగిన గొప్ప వ్యక్తి మహ్మద్ అలీ. తను మారాడు, తన మతాన్ని మార్చుకున్నాడు, తన దేశాన్ని మార్చేందుకు ప్రయత్నించాడు. ఆయన బాక్సింగ్ రింగ్ లోపలే కాదు, వెలుపలా ఛాంపియనే. ఎన్ని కష్టాలెదురైనప్పటికీ తను నమ్మిన విలువల కోసం తుదికంటా నికరంగా నిలిచాడు. బిబిసి ప్రకటించిన ఇరవయ్యో శతాబ్దపు మేటి క్రీడాకారుడి అవార్డుకు ఎంపికయ్యాడు. దాదాపు 32 ఏళ్లుగా పార్కిన్సన్స్ వ్యాధి పీడించినా ఆయనలో ఆ చైతన్యాగ్ని చివరిదాకా రగులుతూనే వుంది.

- కె గడ్డెన్న, వై విశ్వప్రసాద్

వారం క్రితం (జూన్ 4 2016) ఆయనలో అన్ని అవయవాలు పనిచేయడం ఆగిపోవడంతో చనిపోయాడని ప్రకటించిన తరువాత కూడా ముప్పయి నిమిషాల పాటు అలీ గుండె అలానే కొట్టుకుంటూ వుండడం చూసి వైద్యులు సైతం నిర్ఘాంతపోయారు. ఆయన గుండె దిటవు అటువంటిది. మహ్మద్ అలీ తొలి పేరు కాసియస్ మార్సెల్లస్ క్లే జూనియర్. 1942 జనవరి 17న అమెరికాలో కెంటకీలోని లూయిస్‌విల్లీలో పుట్టాడు. కాసియస్ తాత ఒక బానిస. నల్ల జాతీయుడైన కాసియస్ బాల్యం నుంచే జాతి వివక్షకు గురయ్యాడు. క్రీడాకారుడిగా, బాక్సర్‌గా ఎదిగే క్రమంలోనూ ఈ వివక్ష ఆయన్ని వెంటాడింది. 22వ ఏట మొదటి సారి ప్రపంచ హెవీ వెయిట్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ టైటిల్‌ను కాసియస్ సాధించాడు. ఆ తరువాత రెండు రోజులకే వర్ణ వివక్షకు వ్యతిరేకంగా తాను క్రైస్తవాన్ని వీడి ఇస్లాం మతాన్ని స్వీకరించాడు. బానిసత్వానికి సంకేతంగా వున్న కాసియస్ క్లే పేరును త్యజించి మహ్మద్ అలీగా తన పేరు మార్చుకున్నాడు. బాక్సింగ్‌లో శ్వేత జాతి పురుష క్రీడాకారుల అహంకార పోకడలను చూసిన అలీలో కసి పెరిగింది. ఆ పట్టుదలే ఆయన్ని మూడు సార్లు ప్రపంచ హెవీ వెయిట్ ఛాంపియన్‌గా, ఒలింపిక్ పతక విజేతగా నిలిపింది. బెర్లిన్ ఒలింపిక్స్‌లో అన్ని విభాగాల్లోనూ ఆర్యుల ఆధిపత్యమే కొనసాగాలని ఆశించిన ఫాసిస్టు హిట్లర్‌కు దిమ్మ తిరిగే షాకిచ్చిన నల్లజాతి అథ్లెట్ జెసీ ఒవెన్స్ మహ్మద్ అలీకి స్ఫూర్తి ప్రదాత.. అలీకి ముందు జోయ్ లూయిస్, ఆర్చీ మూర్, ఎజార్డ్ చార్లెస్ వంటి నల్లజాతి బాక్సర్లు చాలా మంది వున్నారు. తాను కూడా వారిలో ఒకడిగా వుంటే చాలు అని అలీ అనుకోలేదు. బాక్సింగ్ రింగ్‌కే పరిమితమైతే ఉపయోగం లేదు. నల్ల జాతీయుల పట్ల తరతరాలుగా కొనసాగుతూ వస్తున్న అణచివేత, వర్ణ వివక్షపై పోరాడాలని నిశ్చయించుకున్నాడు. శ్వేత జాతి పెత్తనాన్ని సహించరాదనుకున్నాడు. ఆ క్రమంలోనే మతం మారాడు. వియత్నాంపై అమెరికా యుద్ధాన్ని వ్యతిరేకించాడు. అమెరికాలోని శ్వేత జాతి దురహంకార ప్రభుత్వం మాత్రం మహ్మద్ అలీ ధిక్కార స్వరాన్ని సహించలేకపోయింది. ఆయన గొంతు నొక్కేందుకు అనేక విధాలుగా ప్రయత్నించింది. 1967- 1971 మధ్య ఆ నాలుగేళ్లు అలీ నరక యాతన అనుభవించాడు. ఆయన బాక్సింగ్ లైసెన్సును సస్పెండ్ చేసింది. ఎన్ని ఇబ్బందులెదురైనా తాను నమ్మిన సిద్ధాంతానికే అలీ కట్టుబడి వున్నాడు. 1971లో బాక్సింగ్ రింగ్‌లో తిరిగి ప్రవేశించాక ఆయన సామర్థ్యంపై పలు అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఆ అనుమానాలన్నిటిని పటాపంచలు చేస్తూ 1974, 1978లలో రెండుసార్లు ప్రపంచ హెవీ వెయిట్ బాక్సింగ్ ఛాంపియన్‌గా నిలిచాడు. 'ఫైట్ ఆఫ్ ది సెంచరీ', 'సూపర్ ఫైట్', 'థ్రిల్లా ఇన్ మనీలా', 'రంబుల్ ఇన్ జంగిల్' వంటి చారిత్రక మ్యాచ్‌లలో



అలీ అద్భుతమైన పంచ్‌లతో ప్రత్యర్థులను మట్టి కరిపించాడు. దాదాపు రెండు దశాబ్దాల క్రీడా జీవితంలో ఆయన 61 పోటీల్లో తలపడి 56 మ్యాచ్‌లలో విజయం సాధించాడు. చివరికి 1981లో బాక్సింగ్ జీవితానికి స్వస్తి చెప్పాడు. అలీ 1960, 1970లలో బాక్సింగ్‌లో సాధించిన ఈ అసాధారణ విజయాలతో అత్యున్నత శిఖరానికి చేరుకున్నాడు. జోయ్ ఫ్రేజియర్, జార్జి ఫోర్‌మెన్ వంటి హేమా హేమీలను చిత్తుచేయడం ద్వారా బాక్సింగ్ రింగ్‌లో ఎదురు లేని మొనగాడిగా నిరూపించాడు. అలీ బాక్సింగ్ బరిలోకి దిగితే సీతాకోక చిలుకలా ఎగురుతాడు, ప్రత్యర్థిపై పిడిగుద్దులు కురిపించేందుకు కందిరీగలా దూసుకొస్తాడు (Fly like a butterfly, Sting like a bee) అన్న నినాదాలతో ఆ ప్రాంగణమంతా మార్మోగిపోయేది. ఆ నినాదాలతో కూడిన టీ షర్టులు హాట్ కేకుల్లా అమ్ముడుపోయేవి. ఇన్ని మ్యాచ్‌లు ఆడినా ఎప్పుడూ ఎలాంటి చిన్న వివాదాలకు తావిచ్చేవాడు కాదు. బాక్సింగ్‌లో మకుటం లేని మహారాజుగా అలీ వెలుగొందిన ఆ కాలం హెవీ వెయిట్ బాక్సింగ్ స్వర్ణయుగం. అప్పటి బాక్సర్ మహాయోధులను మట్టి కరిపించి తిరుగులేని యోధుడిగా ప్రస్థానాన్ని సాగించాడు. రిటైర్మెంట్ ప్రకటించిన కొద్ది రోజులకే అలీ పార్కిన్సన్ వ్యాధి బారినపడ్డాడు. పలుమార్లు ఆసుపత్రులకెళ్లాడు. ఆ సమయంలో కూడా పౌర హక్కుల కోసం నిలబడేవారికి, యుద్ధానికి వ్యతిరేకంగా పోరాడేవారికి ఆయన కొండంత అండగా నిలిచేవాడు.

వియత్నాం యుద్ధాన్ని వ్యతిరేకించాడు

అమెరికా వియత్నాంపై ఏకపక్షంగా సాగించిన యుద్ధాన్ని మహ్మద్ అలీ గట్టిగా వ్యతిరేకించాడు. ఆ యుద్ధంలో అమెరికా తరఫున పోరాడేందుకు ఓ అంగీకార పత్రంపై మహ్మద్ అలీని సంతకం చేయమని కోరగా అందుకు ఆయన తిరస్కరించాడు. అమెరికన్ ఆర్మీ మూడు సార్లు అడగ్గా మూడు సార్లూ తిరస్కరించాడు. అమాయకులపై యుద్ధం అనేది 'ఖురాన్' బోధలకు వ్యతిరేకమని, గనుక మీరెంత బలవంతం చేసినా అందుకు అంగీకరించేది లేదని తెగేసి చెప్పాడు. 'నాకు సైనిక యూనిఫాం వేసి, కొన్ని వేల మైళ్ల దూరం పంపి, అక్కడి అమాయక ప్రజల మీద బాంబులు వేయమంటారా? వారిపై తూటాలను పేల్చమంటారా? ఇలా నన్ను అడిగే అధికారం మీకెవరిచ్చారని' ప్రశ్నించాడు. పదివేల మీటర్ల ఆవల ఉన్న చిన్న దేశం అమెరికా ప్రజలకు, తనకు శత్రువెలా అవుతుందని, దానిపై ఎలా దండెత్తుతారని ఆగ్రహించాడు. నిజంగా వియత్నాం అమెరికా ప్రజల ప్రాణాల మీదకు వస్తే సరిహద్దున తొలుత అడ్డుపడేది తానేనని అప్పటి యుద్ధ పరిస్థితుల తప్పొప్పుల గురించి అందరినీ ఆలోచింపజేశాడు. లూయిస్‌విల్లీలో నల్లజాతివారిని నీగ్రోలంటూ చులకన చేసి, వారి మానవ హక్కులను హరించి, వారిని కుక్కల కన్నా హీనంగా చూసే మీకు మమ్మల్ని యుద్ధంలో పాల్గొనమని అడిగే హక్కు ఎక్కడిదని ప్రశ్నించాడు. 'సైన్యంలో చేరడానికి నిరాకరించడం ద్వారా నువ్వు పెద్ద తప్పు చేస్తున్నావు, అందుకు పది వేల డాలర్ల జరిమానా, అయిదేళ్ల జైలు శిక్ష అనుభవించాల్సి వస్తుందని' అధికారి హెచ్చరించినా అలీ ఖాతరు చేయలేదు. ఫలితంగా పోలీసులు ఆయన్ని అరెస్టు చేశారు. అదే రోజు ఆయన బాక్సింగ్ లైసెన్సును



తొలి ప్రపంచ టైటిల్

1964లో అలీ తొలిసారిగా ప్రపంచ హెవీ వెయిట్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ సాధించాడు. సోనీ లిస్టన్‌తో జరిగిన ఈ బౌట్‌లో అలీ ఎలాంటి అంచనాలు లేకుండా బరిలోకి దిగాడు. కానీ కేవలం ఆరు రౌండ్లలోనే లిస్టన్ కథ ముగించాడు. అలీ పంచ్‌లకు తీవ్రంగా గాయపడ్డ లిస్టన్ పోటీ కొనసాగించలేనంటూ బౌట్ నుంచి తప్పుకున్నాడు.

సూపర్ ఫైట్

1974లో రెండోసారి ఫ్రేజర్‌తో రెండో బౌట్లో అలీ విశ్వరూపం చూపించాడు. ప్రపంచ హెవీ వెయిట్ చాంపియన్‌షిప్ కోసం జరిగిన ఈ బౌట్లో అలీ దెబ్బకు ఫ్రేజర్ బిక్కచచ్చిపోయాడు. తొలి రౌండ్ నుంచే అలీ ఫ్రేజర్‌పై పంచ్‌ల మోత మోగించాడు. దీంతో రెండే రౌండ్లల్లో ఫ్రేజర్ కథ ముగిసింది. తొలి రౌండ్‌లో అలీ విసిరిన కొన్ని పంచ్‌లకు ఫ్రేజర్ దిమ్మతిరిగి పడిపోయాడు. తిరిగి లేచి మళ్లీ పోటీ కొనసాగించినా అలీ పంచ్‌ల ధాటికి తట్టుకోలేకపోయాడు. మరోవైపు అలీ చక్కని డిఫెన్స్‌తో తనను తాను రక్షించుకుంటూ పంచ్‌ల స్ట్రోక్ ఇచ్చాడు. చివరిగా ఒకే ఒక్క లెఫ్ట్ హుక్‌తో ఫ్రేజర్‌ను నాకౌట్ చేశాడు.

జీవిత విశేషాలు

1942లో జనవరి 17న అమెరికాలోని కెంటకీలో జననం
అసలు పేరు : కాసియస్ మార్సెలస్ క్లే జూనియర్
ఎత్తు :6.3 అడుగులు

1954 – 12వ ఏటనే బాక్సింగ్‌లో శిక్షణ ప్రారంభం
1959 – అమెరికా జాతీయ అమెచ్యూర్ అథ్లెటిక్ యూనియన్ లైట్ హెవీ వెయిట్ టైటిల్
1960 – రోమ్ ఒలింపిక్స్‌లో లైట్ హెవీ వెయిట్ స్వర్ణం.
– ప్రొఫెషనల్ బాక్సింగ్‌లో ప్రవేశం.
1964 – 22 ఏళ్లకే ప్రపంచ హెవీ వెయిట్ చాంపియన్‌షిప్ టైటిల్ కైవసం
– ఇస్లాం మతంలోకి ప్రవేశించి మహ్మద్ అలీగా పేరు మార్పు.
– సోంజి రాయ్‌తో తొలి వివాహం.
1967 – వియత్నాంతో యుద్ధం కోసం అమెరికా ఆర్మీలో చేరేందుకు అలీ నిరాకరణ.
– అలీపై 5 ఏళ్ల జైలు శిక్ష, బెయిల్‌పై బయటికి వచ్చి 17 ఏళ్ల బెలిండా బాయ్డ్‌తో రెండో వివాహం.
1970 – అమెరికా సుప్రీం కోర్టు తీర్పుతో జైలు నుంచి విడుదల. బాక్సింగ్‌కు పునరంకితం.
1971 – జో ఫ్రేజర్‌తో తొలి శతాబ్దపు ఫైట్‌లో ఓటమి.
1974 – రెండోసారి ప్రపంచ హెవీ వెయిట్ చాంపియన్‌షిప్ టైటిల్
1977 – వెరోనికా పోర్షేతో అలీ మూడో వివాహం
1978 – మూడోసారి ప్రపంచ హెవీ వెయిట్ టైటిల్ కైవసం
ఈ ఘనత సాధించిన తొలి బాక్సర్‌గా రికార్డు.
– అదే ఏడాదిలో రిటైర్మెంట్ ప్రకటన.
1980 – మళ్లీ బాక్సింగ్‌లోకి అడుగు
1981 – ట్రెవర్ బెర్బిక్‌తో ఓటమి అనంతరం కెరీర్‌కు రిటైర్మెంట్
1984 – పార్కిన్సన్ వ్యాధి బాధిస్తోందని తేలింది.
1986 – యోలండా లోనీ విలియమ్స్‌తో నాలుగో వివాహం
1998 – ఐక్యరాజ్య సమితి శాంతి దూతగా నియామకం
2002 – అట్లాంటా ఒలింపిక్స్‌లో జ్యోతి ప్రజ్వలన
2005 – ప్రపంచవ్యాప్తంగా ఎంతో మందిని ప్రభావితం చేసినందుకు 'ప్రెసిడెన్షియల్ మెడల్ ఆఫ్ ఫ్రీడం' పురస్కారం
2012 – లండన్ ఒలింపిక్స్‌కు ప్రత్యేక అతిథిగా హాజరు
2016 జూన్ 4వ తేదీన అలీ తుది శ్వాస విడిచారు.



న్యూయార్క్ రాష్ట్ర అథ్లెటిక్ సంఘం సస్పెండ్ చేసింది. ఆయన నుంచి టైటిళ్లను వెనక్కి తీసుకుంది. అప్పిలేట్ కోర్టు ఆయన్ని దోషిగా నిర్ధారించి అయిదేళ్ల జైలు శిక్ష విధించింది. పది వేల డాలర్ల జరిమానా విధించింది. దీనిని అలీ సుప్రీం కోర్టులో సవాల్ చేయగా, అప్పిలేట్ కోర్టు తీర్పును సుప్రీం కోర్టు 1971 జూన్ 28న కొట్టేసింది. అప్పటికే వియత్నాం యుద్ధం పట్ల అమెరికా ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత గూడుకట్టుకుంది. యుద్ధానికి వ్యతిరేకంగా పౌర హక్కుల ఉద్యమాలు ఊపందుకున్నాయి. అమెరికా అంతటా యూనివర్సిటీలు, కాలేజీల్లో ఎక్కడికక్కడ యుద్ధ వ్యతిరేక సభలు, సమావేశాలు పెట్టి మహ్మద్ అలీని ముఖ్య వక్తగా ఆహ్వానించారు. దీంతో ఆయన ఒక పెద్ద హీరో అయ్యాడు. హార్వర్డు యూనివర్శిటీలో అలీ చేసిన 'నల్ల జాతి వారే ఉత్తములు' (బ్లాక్ ఈజ్ బెస్ట్) అన్న ప్రసంగానికి విద్యార్థుల నుంచి అపూర్వమైన స్పందన వచ్చింది.

ఆ స్టయిలే వేరు

రింగ్‌లో భీకరంగా విరుచుకు పడే అలీని చూసి చిన్నప్పటి నుంచి ఇతనికి బాక్సింగ్ అంటే ఆసక్తని చాలా మంది భావించేవారు. కానీ అది పొరపాటు. అలీ తన 12వ సంవత్సరంలో అనుకోకుండా బాక్సింగ్ గ్లోవ్స్ తొడుక్కున్నాడు. ఆ వయస్సులో అలీ సైకిల్‌ని ఎవరో దొంగతనం చేశారు. ఆ వయస్సులో ఉండే కొంతమంది మాట్లాడే మాదిరిగానే 'దొంగ దొరికితే చితగ్గొట్టి పారేస్తాను' అని అలీ అన్నాడు. అప్పుడు అక్కడ ఉన్న ఒక పోలీసు.. దొంగను చితక్కొట్టాలంటే ముందు బాక్సింగ్ నేర్చుకో అని సలహా ఇచ్చాడు. అలీతో బాక్సింగ్ గ్లోవ్స్ తొడిగించాడు. పోలీసు ఏ ఉద్దేశంతో అన్నా అలీ మాత్రం బాక్సింగ్‌ను సీరియస్‌గా ప్రాక్టీస్ చేశాడు.

కాంగోలో సూపర్ ఫైట్

1974లో జార్జ్ ఫోర్‌మెన్‌తో జరిగిన బౌట్‌తో అలీ తనలోని పూర్తి సామర్థ్యాన్ని బయటికి తీశాడు. ఈ బౌట్‌లో ఫోర్‌మెన్ ఫేవరేట్‌గా బరిలోకి దిగాడు. అప్పటికే ఫ్రేజర్ లాంటి మేటి బాక్సర్‌ను నాకౌట్ చేసి సూపర్ ఫామ్‌లో ఉన్న ఫోర్‌మెన్ ముందు అలీ నిలబడలేడని వ్యాఖ్యలు వచ్చాయి. 40–0 విజయాల రికార్డు ఉన్న ఫోర్‌మెన్ చేతిలో అలీ నాకౌట్ అవుతాడని అంచనాలు వచ్చాయి. కానీ ఫోర్‌మెన్‌ను ఎనిమిది రౌండ్లలోనే మట్టికరిపించి అలీ తాను ఎందుకు గొప్ప బాక్సరో మరోసారి నిరూపించాడు. తన 'రోప్ ఏ డోప్' వ్యూహాన్ని అమలు చేసి ఫోర్‌మెన్‌ను తిప్పలు పెట్టాడు. దీంతో బాగా అలసిపోయిన ఫోర్‌మెన్ అలీ పంచ్‌లకు తలొంచాడు. ఆఫ్రికా ఖండం జైర్ దేశంలోని కాంగోలో జరిగిన ఈ బౌట్‌ను 'రంబుల్ ఇన్ ద జంగిల్'గా పేరు పెట్టారు.

శతాబ్దపు గ్రేట్ ఫైట్

1975లో మరోసారి ఫ్రేజర్‌తో తలపడిన అలీ తన ఆధిపత్యాన్ని నిరూపించుకున్నాడు. మూడు బౌట్ల పోరులో అలీ ఆట తీరు వీక్షకుల్ని మంత్ర ముగ్ధులను చేసింది. తొలి బౌట్‌లో ఓడిన అలీ తరువాత పుంజుకుని మిగిలిన రెండు బౌట్లలోనూ గెలిచాడు. సుదీర్ఘంగా సాగిన ఈ రెండు బౌట్లలోనూ అలీ గెలిచిన తీరు అద్భుతం. ఈ రెండు బౌట్ల గురించి బాక్సింగ్ ప్రియులు ఇప్పటికీ చర్చించుకుంటారు. ఈ బౌట్‌లో తొలి రౌండ్‌లో గెలిచిన ఫ్రేజర్ తరువాత కూడా ఒకటి రెండు పదునైన పంచ్‌లతో అలీని ఇబ్బంది పెట్టినా ప్రభావం చూపలేకపోయాడు. పంచ్‌లపై పంచ్‌లు కురిపిస్తూ అలీ విజయం సొంతం చేసుకున్నాడు.



ఆరేళ్ళ తిరిగే సరికే బాక్సింగ్ ప్రపంచంలో సంచలనం అయిపోయాడు. 18 ఏళ్ల వయసులోనే ఒలింపిక్స్‌లో బాక్సింగ్ స్వర్ణం సాధించాడు. 22 ఏళ్లకే హెవీ వెయిట్ చాంపియన్‌గా నిలిచాడు. విజయానికి నిర్వచనమయ్యాడు. ఆయన లోని ఆ ఒర్పు, నేర్పు అనితర సాధ్యం. ఆటగాళ్లకు శిక్షణ, సాధన ప్రాధాన్యత ఎంత అవసరమో అలీ నొక్కి చెప్పాడు. 'ఒకప్పుడు సాధన అంటేనే అసహ్యించుకునేవాణ్ని. కానీ జీవితమంతా విజేతగా ఉండాలంటే సాధన తప్పనిసరి అని గ్రహించాను. ఎంత బాధ అనిపించినా సాధన కొనసాగించాను' అని అలీ ఒక సందర్భంలో చెప్పాడు. 'సాధనమున పనులు సమకూరు ధరలోన..' అనే మాటను అలీ తనదైన శైలిలో వివరించాడు. కఠోర శ్రమ వుంటే ఎంతటి విజయాన్ని అయినా సాధించవచ్చు అని అలీ జీవితం మనకు బోధిస్తుంది. రింగ్‌లో ప్రత్యర్థులపై బలమైన పంచ్‌లతో విరుచుకుపడడమే కాదు, రింగ్‌లో వార్మప్‌లో భాగంగా ఆయన వేసే స్టెప్పులు అందరినీ ఎంతగానో ఆకట్టుకునేవి. పది సెకన్ల వ్యవధిలోనే 30కి పైగా పిడిగుద్దులు కురిపించి ప్రత్యర్థికి చుక్కలు చూపించేవాడు. రెండు దశాబ్దాలకు పైగా సాగిన ఆయన కెరీర్ ముగింపు లో మాత్రం కొన్ని పరాజయాలు ఎదుర్కొన్నాడు.

తొలి ఓటమి

1971లో జో ఫ్రేజర్‌తో అలీ పాల్గొన్న బౌట్ ఈ శతాబ్దంలోనే గొప్ప బౌట్‌గా ప్రసిద్ధి పొందింది. ఈ బౌట్ ముందు వరకూ అలీ, ఫ్రేజర్‌లకు ఓటమన్నదే లేదు. ఇద్దరూ కొదమ సింహాల్లా తలపడ్డారు. ఫ్రేజర్ తన లెఫ్ట్ హుక్ పంచ్‌లతో అలీని ఉక్కిరిబిక్కిరి చేస్తే అలీ డిఫెన్స్‌ను అనుసరించాడు. అలీ ఒక దశలో పంచ్ పవర్ చూపించడంతో బౌట్ నువ్వానేనా అన్నట్లు సాగింది. ఫ్రేజర్ విసిరిన కొన్ని పంచ్‌లు అలీకి బలంగా తగలడంతో కిందపడిపోయాడు. ముఖంపై రక్తం ఓడుతూనే పోరాటం సాగించిన అలీ తరువాత నిలవలేకపో యాడు. అలీ కెరీర్‌లో ఇదే తొలి ఓటమి. 1978లో మొదటిసారి రిటైర్మెంట్ ప్రకటించిన అలీ, మళ్లీ రెండేళ్ల

సినిమాలలో...

అలీ జీవితం ఒక సినిమా కథ లాంటిది. అందుకే ఆయనపై హాలీవుడ్‌లో ఎన్నో సినిమాలు వచ్చాయి. కొన్నిటిలో తన పాత్రను తానే ధరించడం విశేషం. 1977లో తీసిన 'గ్రేటెస్ట్'లో అలీ తన పాత్రను తనే పోషించి మెప్పించాడు. 2001లో తీసిన అలీ సినిమాలో విల్‌స్మిత్ ... మహ్మద్ అలీ పాత్ర వేసి ఆస్కార్ నామినేషన్ దక్కించుకున్నాడు. హోవర్డ్ ఫాస్ట్ నవల ఆధారంగా 1979లో తీసిన 'ఫ్రీడం రోడ్'లో అలీయే హీరో. ఆటలో మెడల్స్‌లాగే మరికొంచెం గట్టిగా పట్టుబడితే ఆస్కార్ కూడా వచ్చేదన్నారు సినీవిమర్శకులు. కొన్ని సినిమాలు భారత్‌లోనూ విడుదలై ప్రేక్షకాదరణ పొందాయి. బాలీవుడ్ సూపర్‌స్టార్ అమితాబ్ బచ్చన్ 1980లలో లాస్ ఏంజెల్స్ వెళ్లి అలీని కలిశారు. ఆయన వెంట దర్శక నిర్మాత ప్రకాశ్ మెహ్రా కూడా వున్నారు. అలీ, తనతో మెహ్రా ఓ సినిమా తీయాలనుకున్నారని బిగ్ బి ట్విటర్‌లో కూడా వెల్లడిం చారు. 1980లో అలీ ఇండియా వచ్చినప్పుడు చెన్నైలోని నెహ్రూ స్టేడియంలో ఎగ్జిబిషన్ ఫైట్ ఏర్పాటైంది. ఆ సందర్భంగా స్టేడియంకు వచ్చిన తమిళనాడు సూపర్‌స్టార్ ఎమ్.జి. రామచంద్రన్‌తో అలీ చేతులు పైకెత్తినప్పుడు స్టేడియం హర్షధ్వానాలతో దద్దరిల్లడం చాలా మంది ఇప్పటికీ గుర్తు చేసుకుంటారు.

తరువాత రింగ్‌లోకి ప్రవేశించాడు. హోమ్స్ చేతిలో తీవ్రంగా గాయపడ్డాడు. అలీ మెదడు తీవ్రంగా దెబ్బతింది. హోమ్స్ ఇలా పంచ్‌లు కురిపిస్తాడని తెలిస్తే తానీ బౌట్ ఆడేవాడినే కాదని ఆ తరువాత అలీ చెప్పాడు. కెరీర్‌లో 90 శాతం విజయాలు నమోదు చేసుకున్న అలీ.. మొత్తంగా 29 వేల పంచ్‌లు తిన్నాడని అంచనా. ఇన్ని వేల పంచ్‌లతో అలీ శరీరం ఎంత గాయపడి ఉంటుందో, కోలుకోవడం ఇంకెంత కష్టమై ఉంటుందో ఊహించుకోవచ్చు. మొత్తం 61 బౌట్స్‌లో పాల్గొన్న అలీ 56 విజయాలను తన ఖాతాలో వేసుకున్నాడు. ఇందులో 37 నాకౌట్స్ ఉన్నాయి. కేవలం 5 బౌట్స్‌లో మాత్రమే ఓడిపోయాడు. అలీ గొప్పతనం అంతా గొప్ప బాక్సర్‌గా ఎదగడం లో మాత్రమే లేదు. పౌర హక్కుల కోసం, వర్ణ వివక్షపై పోరాడ్డంలోనూ ఉంది. తాను నమ్మిన సిద్ధాంతం కోసం అలీ ఎంత దూరమైనా వెళ్లాడు. సేవా కార్యక్రమాలు, స్ఫూర్తి ప్రసంగాలు, కవితలతోనూ అలీ ఎందరో అభిమానులను సంపాదించుకు న్నాడు. రచయితగా కూడా అలీ పేరు గడించాడు. ప్రపంచ వ్యాప్తంగా ఎంతో పేరు తెచ్చుకున్న అలీ అనేక అవమానాలను ఎదుర్కొన్నారు. 1960లో ఒలింపిక్ పతకం సాధించిన అలీకి నల్ల జాతీయుడన్న ఒకే ఒక్క కారణంతో అమెరికా చాంబర్ ఆఫ్ కామర్స్ విందు కూడా ఇవ్వలేదు. సహచర బాక్సర్లు అలీ ఇచ్చిన తిండి తినడానికి కూడా ఇష్టపడే వాళ్లు కాదు. అలీ గొప్ప బాక్సర్‌గా ఎదిగిన తరువాత ఒక రెస్టారెంట్‌కు వెళితే వడ్డించ డానికి సర్వర్లు ఎవరూ రాలేదు. దీంతో గొడవ పడిన అలీ తాను సాధించిన ఒలిం పిక్ పతకాన్ని నదిలోకి విసిరికొట్టాడు. బాక్సింగ్ ద్వారా కోట్ల డాలర్లు సంపాదిం చినా అందులో ఎక్కువ భాగాన్ని సేవా కార్యక్రమాలకే ఖర్చు చేశాడు. సేవా కార్యక్రమంలో భాగంగా ఎన్నో దేశాలు పర్యటిం చాడు. 'సహాయం చేయడం అంటే ఈ భూమిపై ఉన్నందుకు అద్దె చెల్లించడం వంటిది' అని అనడం ఆయన ఔన్నత్యాన్ని తెలియజేస్తోంది. మనుషుల్లో టాలెంట్ కంటే మానవత్వం కలిగి ఉండటమే గొప్ప అని ఆయన భావించేవాడు.

బాక్సింగ్ వారసురాలు

'నాన్నా... నేనూ నీలాగే బాక్సర్‌ను అవుదామనుకుంటున్నా' అని కూతురు అడిగిన క్షణాన ఆ తండ్రి ఒక్కసారిగా ఆశ్చర్యపోయాడు. 'ఛాతీపై దెబ్బలు తినేందుకు కాదు అమ్మాయిల శరీరం వున్నది' అంటూ ఇరవై ఏళ్లుగా బాక్సింగ్ రింగ్‌లో తనకైన ప్రమాదాల గురించి చెప్పుకొ చ్చాడు. కానీ ఆ తర్వాత అనూహ్యంగా ఆమె ఎదురుగా నిలబడి పంచ్‌లు కొట్టేందుకు సిద్ధమైంది. తేరుకోవడానికి కాస్త ఆలస్యమైనా మనసు కష్టపెట్టు కున్నా ఇష్టంలేక ఒప్పుకున్నాడు. అయితే మహ్మద్ అలీ కూతురు లైలా అలీ తం డ్రిని నిరాశ పరచలేదు. మహిళల బాక్సింగ్‌లో జగజ్జేతగా నిలిచి తండ్రి గర్వప డేలా చేసింది. 24 బౌట్‌లు ఆడితే 21 నాకౌట్‌లు సహా అన్నీ విజయాలే. అలీ సంతానంలో ఎక్కువగా పాపులర్ అయింది లైలానే. తండ్రి వారసత్వాన్ని కొనసాగించి ఆయన గర్వపడేలా చేసింది. మహ్మద్ అలీకి మొత్తం నలుగురు భార్యలు. 9 మంది పిల్లలు. మూడవ భార్య పిల్లలైన లైలా అలీ, హనా అలీతోనే ఆయనకు అనుబంధం ఎక్కువ.

మహ్మద్ అలీతో కూతురు లైలా

62 అడుగుల జుట్టు



గుజరాత్‌లోని వడోదరాకు చెందిన సవ్‌జి భాయ్ రత్వా (60)ని దూరం నుంచి చూసిన వారెవరైనా తన చేతికి ఒక పెద్ద నల్లని తాడును తగిల్చుకుని వెళుతున్నాడనుకుంటారు. దగ్గరి నుండీ చూస్తే గానీ అది జుట్టని అర్థం కాదెవరికి. అక్షరాలా 62 అడుగుల పొడవున జుట్టు పెంచేశాడు. ఏళ్ల తరబడి పెంచిన తన జుట్టును రెండు రోజులకోసారి శుభ్రం చేస్తుంటాడు రత్వా. తల స్నానానికి మూడు గంటల పాటు కష్టపడాల్సొస్తుంది. తర్వాత పొలం గట్టు దగ్గర తిరుగుతూ జుట్టును ఆరబెట్టుకోవడంలో మనవలు కూడా సాయపడుతుంటారట. ఇంటి భోజనం తప్ప బయట భోజనాన్ని ఇప్పటి వరకు రుచి చూడలేదట. తను తీసుకునే ఆహారం కూడా పూర్తి శాకాహారంగానే ఉంటుంది. ఎక్కువ కారం ఉండని ఆహారంతో పాటు బయటికెళ్లినప్పుడు అరటి పండుతో పొట్ట నింపుకుంటాడట. ప్రపంచంలోనే 22 అడుగుల అతి పొడవైన జుట్టుతో చైనాకు చెందిన ట్రాన్ వాన్ హై రికార్డుకెక్కాడు. గిన్నీస్ బుక్‌లో పేరు నమోదు చేసుకునేందుకు రత్వా ప్రయత్నిస్తున్నాడు.

వింత లోకం

బోరింగ్ కాదు

చాలా సమావేశాల్లో చెప్పిన విషయాలనే పదే పదే చెప్తూ కొందరు బోర్ కొట్టిస్తుంటారు. అలా ఎన్ని సమావేశాల్ని భరించాడో తెలీదు కానీ లండన్‌కు చెందిన జేమ్స్‌వార్డ్ బోరింగ్ కాన్ఫరెన్స్‌ల పేరిట ఓ విచిత్రమైన సమావేశాల్ని పెడుతున్నాడు. పేపర్ బ్యాగ్స్, టాయిలెట్ రోల్, క్వాలిటి కంట్రోల్ లాంటి సాధారణ విషయాలనే తన ప్రసంగాలకి టాపిక్స్‌గా ఎంచుకున్నాడు. వీటితో నెట్‌లోకంలో తెగ పాపులరయ్యాడు. సోషల్ మీడియాలో బోరింగ్ థింగ్స్ పై తాను చేసిన పోస్టులకి స్పందన ఊహించనంతగా ఉంటోంది. ఈ నెలలో ఆయన నిర్వహించిన ఒక సదస్సులో 425 టికెట్లు అమ్మటం జేమ్స్‌వార్డ్ పాపులారిటీని పెంచింది. తెలిసిన విషయాలే అయినా అవి ప్రజలకు మరింత నచ్చడానికి కారణం అందరినీ ఆకట్టుకునేలా ప్రసంగించడంతో పాటు చెప్పాలనుకున్న విషయాన్ని సూటిగా చెప్పడమే అంటాడు జేమ్స్. హోటల్ తరహాలో వండటం, ఇంక్‌జెట్ ప్రింటర్లు, జెర్మన్ ఫిల్మ్ టైటిల్ ఈ ఏడాది నిర్వహించిన ప్రసంగాల్లో ప్రధానాంశాలు. సాధారణంగా ఇవి బోరింగ్ అంశాలే అయినా జేమ్స్ చెబుతుంటే బాగా వింటున్నారు. మార్కెటింగ్ రంగంలో అనుభవం ఉన్న జేమ్స్ ఎలాంటి విషయాన్నైనా ఆకట్టుకునేలా ప్రసంగిస్తాడు.

ప్రొఫెసర్ స్పైడీ

పాఠ్యాంశాల్ని బోధించడంలో విద్యార్థులను ఆకట్టుకునేందుకు రకరకాల టెక్నిక్స్‌ని ప్రయత్నిస్తుంటారు ప్రొఫెసర్లు. మెక్సికోలోని నేషనల్ అటానమస్ యూనివర్సిటీలో ఓ కంప్యూటర్ సైన్స్ ప్రొఫెసర్ మాత్రం స్పైడర్ మ్యాన్‌గా ప్రత్యక్షమవుతాడు. వింతగొలిపే గెటప్‌తో పాటు స్పైడర్ మ్యాన్ ఫీట్స్ చేయడంలో ఆరితేరిన మోయిజెస్ వజ్క్వెజ్ రెయెస్ పిల్లల్ని తన బోధనతో ఆకట్టుకుంటాడు. పాఠాలు బోర్ కొట్టకుండా మధ్యలో వినోదం పంచుతుంటాడు. అతడికి పన్నెండేళ్ల వయసు ఉన్నపుడు స్పైడర్ మ్యాన్ సినిమా అతన్ని ఎంతగానో ప్రభావితం చేసింది. అప్పటి నుండి స్పైడర్ మ్యాన్‌ని ఫాలో అవుతూ చేసే ఫీట్స్‌లో ఫెయిలయ్యాడు. ప్రొఫెసర్‌గా ఉద్యోగం సంపాదించినా స్పైడర్ మ్యాన్ గెటప్ విడవక పోవడంతో కుటుంబ సభ్యులు ఉద్యోగం కోల్పోవలసి వస్తుందని భయపడ్డారు. అయితే ప్రొఫెసర్‌గా మారాక ఈ గెటప్ రెయెస్‌కి ఎంతగానో ఉపయోగపడింది.





విజ్ఞానం

లీగల్ ఇష్యూలంటే చాలు వేలకు వేలు ఫీజులు చెల్లించి లాయర్లను పెట్టుకోవాలని చాలా మంది బాధపడుతుంటారు. అలాంటి అవసరాలకు రోబో లాయర్ ఒక ప్రత్యామ్నాయం కానున్నాడు. పార్కింగ్ టికెట్స్‌తో పాటు ఇన్సూరెన్స్ క్లైమ్, ఫ్లైట్ టికెట్స్ వంటి వాటికి సంబంధించిన చట్టపరమైన విషయాల్లో యూకేలో ఈ రోబో లాయర్ సేవలు అందిస్తున్నాడు. నిజాని కివి నేరుగా కేసు వాదించకున్నా న్యాయపరమైన విషయాల్లో చక్కటి సూచనలు అందిస్తున్నాడు. ప్రస్తుతానికి చిన్నపాటి విషయాల్లో సాయమందిస్తున్నా భవిష్యత్తులో కేసులు కూడా వాదించే స్థాయికి రోబో లాయర్‌ల టెక్నాలజీ అభివృద్ధి చెందినా ఆశ్చర్యం లేదు.

రోబో లాయర్

కంప్యూటర్, ల్యాప్‌టాప్, ఐపాడ్, ఐఫోన్, రోబో అసిస్టెన్స్ ఇవన్నీ మానవ ఆలోచనలే. టెక్నాలజీ అభివృద్ధి అవుతున్న కొద్దీ మానవ మేధస్సుకి ధీటుగా ఇప్పుడు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ పోటీపడుతోంది. మనం చేసే సాధారణ పనులెన్నిటినో ప్రిలోడెడ్ ఇన్‌స్ట్రక్షన్స్ ప్రకారం ఇప్పుడు రోబోలు వేగంగా చేసేస్తున్నాయి. దీంతో వివిధ రంగాల్లో వాటి సేవలను వినియోగించుకుంటున్నారు. ఇంగ్లాండ్, రష్యా, అమెరికా లాంట్టి దేశాల్లో పార్కింగ్ టికెట్‌ల విషయంలో మధ్యవర్తులకు చెల్లించే డబ్బుకు అదనంగా ఏదైనా సమస్య వస్తే వాదించేందుకు లాయర్ల చెల్లింపులూ అధికంగానే ఉంటాయి. పార్కింగ్ రూల్స్ ప్రకారం వాహనాన్ని పార్క్ చేయకపోయినా, అవయవ లోపం ఉన్న వారికి కేటాయించిన పార్కింగ్ ప్రదేశాల్లో ఇతరులు పార్కింగ్ చేసినా, కొన్ని ప్రదేశాల్లో సమయానికి మించి వాహనాల్ని పార్క్ చేసినా అలాంటి వాటన్నిటికి చట్టపరమైన శిక్షలుంటాయి, వెంటనే పార్కింగ్ టికెట్ ఇచ్చేస్తారు. ఇదే కాదు ఫ్లైట్ డిలే అయిన సందర్భంలో టికెట్ డబ్బును క్లైమ్ చేసే విషయాల కోసం లాయర్ల వరకు వెళ్లాల్సి వస్తోంది. ఈ మధ్య ఇలాంటి కేసులు మరీ ఎక్కువైపోయి లాయర్లు వసూలు చేసే ఫీజులు కూడా ఎక్కువయ్యాయి. వాటి బెడద నుండి బయటపడేందుకు రోబో లాయర్‌ని తయారు చేశాడు జోషువా బ్రౌడర్. లండన్‌లోని హ్యాంప్‌స్టెడ్‌లో పెరిగిన బ్రౌడర్ కంప్యూటర్ సైన్స్‌లో డిగ్రీ పూర్తిచేశాడు. 16 ఏళ్లకే అమెరికాలోని మానవ హక్కుల పరిరక్షణ సంస్థకి 'ఫ్రీడమ్ హౌస్–1' అనే ఒక మొబైల్ యాప్‌ని తయారు చేశాడు బ్రౌడర్. మానవ హక్కులని పరిరక్షించుకోడానికి ఇలాంటి మొబైల్ యాప్స్ పూర్తిగా ఉపయోగపడతాయ ంటాడు బ్రౌడర్. పద్దెనిమిదేళ్ల వయసులో తాను పొందిన పార్కింగ్ టికెట్స్‌లో చాలా వరకు నకిలీవని తెలుసుకున్న బ్రౌడర్ ఇలాంటి వాటిని నియంత్రించేందుకు తన సొంత పరిజ్ఞానాన్ని ఉపయోగించి వెబ్ రోబో (బాట్)ని ప్రారంభించాడు.

'డునాట్‌పే' అనే పేరుతో తను ప్రారంభించిన వెబ్ రోబో ద్వారా 86,000 అర్జీలు వచ్చాయి. బ్రిటిష్ కౌన్సిల్ వసూలు చేసే పార్కింగ్ ఫైన్‌కి సంబంధించి వివిధ విజ్ఞప్తుల్ని పంపారు. వెబ్‌సైట్‌లో సైన్‌ఇన్ చేసిన తర్వాత వెలువడే చాట్ స్క్రీన్ ద్వారా బాట్ అడిగే కొన్ని ప్రశ్నలకి మనం సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది. అలా చేయడం ద్వారా మనం కోర్టుకు పంపే అర్జీ పత్రాన్ని మనకి అందిస్తుంది బాట్. మన దైనందిక జీవితంలో కొన్ని చిన్న చిన్న విషయాల్లో చట్టపరమైన అంశాలపై సలహాల కోసం వయసు పైబడిన వారితోపాటు వికలాంగులకి ఎంతగానో ఉపయోగపడింది. 2015లో ప్రారంభించిన బాట్ ఇప్పటి వరకు పార్కింగ్ టికెట్స్ సమస్యపై దాదాపు 20 కోట్ల రూపాయల్ని ఫైన్‌ల రూపంలో బ్రిటీష్ కౌన్సిల్‌కి అందించింది. బ్రిటన్ చట్టాలకు లోబడి బాట్‌ని రూపొందించినా అమెరికాకు సంబంధించిన కొన్ని చట్టాలు ఇరు దేశాలకీ ఒకలాగే ఉండడంతో బాట్ సేవలు ఇప్పుడు అమెరికా ప్రజలకు కూడా ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. బ్రౌడర్ ప్రవేశపెట్టిన బాట్ లాయర్ ప్రపంచంలోనే మొట్టమొదటిది. కేసుకు సంబంధించి జడ్జమెంట్ అంచనా విషయంలోనూ నిక్కచ్చిగా ఫలితాలు ఉండడంతో వీటికి అర్జీలు పెరిగాయి. తన బంధువులు, కొంత మంది మిత్రులకైనా సేవలు ఉపయోగపడాలనే ఉద్దేశంతో తొలుత బాట్ లాయర్‌ని తయారుచేసినా ఆదరణ పెరగడంతో బ్రౌడర్ తన బాట్ టెక్నాలజీని కార్ డ్రైవింగ్ అంశానికి మలచనున్నాడు.

✦

అమెరికాకు చెందిన న్యాయ సేవల సంస్థ 'బేకర్‌హోస్‌టెట్‌లర్' 'రాస్' పరిజ్ఞానంతో తయారు చేసిన రోబో లాయర్‌పై అనుమతులు పొందింది. ఐబిఎమ్ కాగ్నిటివ్ కంప్యూటర్ పరిజ్ఞానంతో తయారు చేసిన ఈ రోబో స్థానిక భాషని మాట్లాడగలదు. లీగల్ పరిశోధనల్లో పనిచేసే వివిధ బృందాలకు ఈ రోబో సహాయపడుతుంది. పరిశోధనలకు సంబంధించి లాయర్లు అడిగే ప్రశ్నలకి వారి భాషలోనే సమాధానమిస్తుంది. పాత కేసుల తీర్పులతో పాటు, చట్టపరమైన పూర్తి ఆధారాలతో సమాధానాలిస్తుంది. అంతే కాదు కచ్చితమైన ఫలితాలకోసం ఎప్పటికప్పుడు కొత్తకేసుల్ని పరిశీలిస్తుందీ రోబో. చట్ట పరమైన పరిశోధనల్లో లాయర్లకి కృత్రిమమైన మేధస్సు కూడా తోడ్పడేందుకు రాస్‌పై తొలుత 2014లో టొరొంటో యూనివర్శిటీలో పరిశోధనలు చేశారు. అవి విజయవంత మవదంతో రాస్‌కి సదరు సంస్థ బ్యాంకు చట్టాల్ని బోధిస్తోంది. బ్యాంకు లావాదేవీల్లో దివాలాలకు సంబంధించి వివిధ కేసుల అధ్యయనంతో బేకర్‌హోస్‌టెట్‌లర్ సంస్థకి తన సేవలందించబోతోంది రాస్.

'దండి' యాత్ర

సేవ

సూర్యుడు ఉదయించడంతోనే కాలూ దంగార్ నిద్ర లేస్తాడు. చేతికి ఒక సంచి తగిలించుకుని గుజరాత్ దండి బీచ్ దిశగా పయనం మొదలు పెడతాడు. ఉప్పు సత్యాగ్రహానికి కాదు జబ్బు చేసిన 'దండి'కి చికిత్స చేయడానికి. కొన్నేళ్ల క్రితం ఇక్కడి కడలి ఒడ్డున చెత్త పోగుపడి కంపు కొట్టేది. కానీ కాలూ కాలు పెట్టాక అంతా స్వచ్ఛంగా మారిపోయింది. నలభై ఏళ్ల ఈ పర్యావరణ పరిరక్షకుడు నాలుగేళ్లుగా రోజూ బీచ్‌లోని చెత్తను తొలగిస్తూ దండి చరిత్రకు దుమ్ము కొట్టకుండా చూస్తున్నాడు.

ఇంటి పరిశుభ్రతపై శ్రద్ధ చూపే చాలా మంది పరిసరాలను మాత్రం అస్సలు పట్టించుకోరు. చెత్తంతా రోడ్డుపై విసిరేస్తూ చేతులు దులుపుకుంటారు. ఇంటి పరిసరాల విషయం ఇలా ఉంటే ఇక బీచ్‌ల పరిస్థితి వేరే చెప్పనవసరం లేదు. మన దేశంలోని చాలా బీచ్‌ల వద్ద అడుగడుగునా అపరిశుభ్ర వాతావరణం కనిపిస్తుంది. ప్లాస్టిక్ కవర్లు, వాటర్ బాటిల్స్, మానవ వ్యర్థాలతో టన్నుల కొద్దీ చెత్త బీచ్ వద్దే పేరుకుపోతోంది. పర్యావరణ కాలుష్యంతోపాటు పర్యాటకుల ఆరోగ్యానికి ప్రమాదకరంగా మారుతున్న గుజరాత్‌లోని దండి బీచ్‌ని శుభ్రపరిచేందుకు ముందుకొచ్చాడు కాలూ దంగార్. పారిశుధ్య కార్మికుడిగా తన పనిని చేయడం లేదు కాలూ దంగార్ ఆయనో సామాజిక శాస్త్రవేత్త.

గుజరాత్‌లోని వినయ్ మందిర్ స్కూల్ హాస్టల్ ప్రాంతంలో నివసిస్తున్న కాలూ దంగార్ ఉదయం 6:30 కల్లా ఒక సంచితో బయలుదేరతాడు. దండి బీచ్‌కి చేరుకుని అక్కడ పడి ఉన్న చెత్తంతా ఏరేస్తాడు. ప్రతి రోజూ ఉదయాన్నే బీచ్ ఒడ్డున మూడు కిలో మీటర్లు కాలి నడకనే ఈ పరిశుభ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాడు. ఇలా నాలుగేళ్లుగా ఒక్కడే బీచ్‌ని శుభ్రపరిచే బాధ్యత తీసుకున్నాడు. బీచ్‌లోని వ్యర్థాలను సేకరించడం పూర్తయ్యాక బీచ్ ముఖద్వారం దండి చౌపతికి చేరుకుని ఆ ప్రదేశాన్ని కూడా అందంగా తీర్చిదిద్దుతాడు. అక్కడి నుండి ఉద్యానవనం వైపు తన నడక మొదలౌతుంది. గార్డెన్‌లోని చెత్తను తొలగించి అక్కడున్న మొక్కలకి నీరందించడంతోపాటు ఎప్పటికప్పుడు వాటిని పరిరక్షిస్తుంటాడు. ఇక అక్కడికి వచ్చే పర్యాటకులకు నీరందించడం కోసం 2000 లీటర్ల ఓవర్ హెడ్‌ట్యాంక్‌ని మంచి నీటితో నింపడంతో బీచ్ క్లీనింగ్ కార్యక్రమాలు పూర్తవుతాయి. నాలుగు పదుల వయసులో ప్రతిరోజూ గంటల తరబడి కష్టపడటమెందుకని అడిగేవారికి సమాధానంగా ఈ పనిని పూర్తి ఇష్టంతోటే చేస్తున్నానంటారు. అంతేకాదు మనుషులతో పాటు అనేక రకాల జీవులకి హాని కలిగిస్తున్న మానవ వ్యర్థాలను తొలగించడం తన బాధ్యతగా భావిస్తాడు. బీచ్ ఒడ్డున వాకింగ్ కోసం వచ్చే వారితోపాటు, ఎంతో మంది పర్యాటకులని తమతో పాటు తెచ్చుకున్న వస్తువులు, వాటర్ బాటిల్స్‌ని బీచ్‌లో పడేయద్దంటూ సూచిస్తాడు. దగ్గరలో ఉన్న డస్ట్‌బిన్స్‌ని వినియోగించాలని పదేపదే కోరినా కొందరు ఈ మాటలేవీ పట్టించుకోకుండా తమ ఇష్టాను సారం వ్యవహరిస్తుంటారు. పర్యావరణాన్ని పట్టించుకోకుండా ఇలా బీచ్ పరిసరాలను పాడుచేయడం అతన్ని బాధిస్తోంది. దక్షిణ గుజరాత్‌లో ఉన్న బీచ్‌లన్నిటిలో కల్లా నవసారి జిల్లాలోని దండి బీచ్‌కి ఉప్పు సత్యాగ్రహ చరిత్ర కూడా ఉండటంతో ఈ బీచ్‌కి టూరిస్టుల తాకిడి ఎక్కువే. బీచ్‌ని శుభ్రపరిచేందుకు ప్రభుత్వం అడపాదడపా కొన్ని కార్యక్రమాలు చేపడుతున్నా రోజూ పేరుకుపోయే చెత్త సమస్యకు ఏ మాత్రం పరిష్కారం చూపడం లేదు. ఈ విషయాన్ని గ్రహించిన కాలూ దంగార్ దండి బీచ్‌ని శుభ్రపరిచే కార్యక్రమాన్ని చేపట్టాడు. ఏళ్ల తరబడి చేస్తున్న ఆయన కృషి వల్ల ప్రస్తుతం దండి బీచ్ అక్కడున్న బీచ్‌లన్నిటిలోకి అత్యంత పరిశుభ్రతతో ఆహ్లాదకరంగా మారింది. బీచ్ పరిసరాలని సుందరంగా తీర్చిదిద్దటంతోపాటు అక్కడున్న చిరు వ్యాపారులకు కొన్ని సంక్షేమ కార్యక్రమాలని నిర్వహిస్తున్నాడు. దండి బీచ్‌ని పరిశుభ్రంగా ఉంచేందుకు కాలూ దంగార్ నిర్వహిస్తున్న అనేక కార్యక్రమాలు అక్కడి యువతను ఆకట్టుకోవడంతో వారు కూడా బీచ్ పరిరక్షణపై ఆసక్తి చూపుతున్నారు.

- శర్వాణి



తెలుసా

చిట్టి చేతులకు శిక్షొద్దు

◆ అంతర్జాతీయ కార్మిక సంస్థ ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 16.8 కోట్ల మంది బాల కార్మికుల్లో 8.5 కోట్ల మంది ప్రమాదకరమైన వృత్తుల్లో మగ్గుతున్నారు. 15–18 సంవత్సరాల వయసున్న పిల్లల్ని ఫ్యాక్టరీ పనుల్లోకి తీసుకున్నా నిర్ణీత సమయాలకు సంబంధించిన నిబంధనలు పాటించాల్సి ఉంది.

◆ బాల కార్మికుల సమస్యల్ని ప్రపంచ దృష్టికి తీసుకొచ్చేందుకు 2002 నుండి ఏటా జూన్ 12 ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.



◆ బాల కార్మికుల ప్రొహిబిషన్ అండ్ రెగ్యులేషన్ చట్టం 1986 ప్రకారం 14 ఏళ్ల లోపు పిల్లల్ని వ్యాపార సంస్థల్లో తీసుకోవడం చట్ట వ్యతిరేకం.

◆ బాలకార్మిక చట్టాలని అతిక్రమించి పిల్లల్ని పనికి పంపిన తల్లిదండ్రులకు 10 వేల రూపాయల జరిమానా విధిస్తారు.



◆ ఒక సర్వే ప్రకారం భారత్‌లో కోటీ 70 లక్షల మంది బాల కార్మికులు న్నట్టు తేలింది. బీహార్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, మధ్య ప్రదేశ్, మహారాష్ట్రలోనే సుమారు 55 లక్షల మంది ఉన్నట్లు అంచనా.



◆ యాచించడం, దొంగతనం, వర్తకం, వ్యభిచారం, అశ్లీలత వంటి అక్రమ కార్యకలాపాలకు ఉపయోగించుకునే పిల్లల్ని కూడా బాల కార్మికులుగా పరిగణిస్తారు.

◆ రాత్రి 7 గంటల నుండి ఉదయం 8 గంటల మధ్య పిల్లల్ని పనిలో అనుమతించడం చట్టరీత్యా నేరం.

◆ పర్యాటకం అభివృద్ధి చెందుతున్న దేశాల్లో వ్యవసాయం, కర్మాగారాలు, ఇటుక బట్టీలు, గనులు, నిర్మాణం, రెస్టారెంట్లలో పిల్లలు నిర్బంధ బాలకార్మికులుగా మారుతున్నారు.

◆ ప్రపంచ వ్యాప్తంగా 10 లక్షల మంది బాల కార్మికులు వ్యవసాయం, ఇతర రకాల పనుల్లో దోపిడి, దుర్వినియోగానికి గురౌతున్నారు.

◆ అంతర్జాతీయ బానిసత్వ వ్యతిరేక సంస్థ ప్రకారం ప్రపంచవ్యాప్తంగా తరచూ ఘర్షణలు జరిగే దాదాపు 30 దేశాలలో 3 లక్షల మంది బాల సైనికులు పనిచేస్తున్నారు.

◆ బాల కార్మికుల్లో ఎంతో మంది పిల్లల్ని సాయుధ పోరాటాలకి సైనికులుగా తీసుకోవడంతో పాటు బాలికలపై లైంగిక హింసకు పాల్పడుతున్నారు.

◆ 18 ఏళ్లు నిండని బాలలు గనుల్లో పనిచేయడం 1952 గనుల చట్టం ప్రకారం నిషిద్ధం.

◆ ఆసియా, పసిఫిక్ ఖండాల్లో 9.3 శాతంగా ఉన్న బాల కార్మికుల కంటే సబ్ సహారా ఆఫ్రికా ఖండాల్లో అధికంగా 21 శాతం మంది బాల కార్మికులు ఉన్న సందర్భాలు నమోదయ్యాయి.

జీవిత పుస్తకం తెరిస్తే ...

కిటికీ తెరిస్తే..
రచయిత: విహారి
పేజీలు: 129
వెల: 110/-
ప్రతులకు: చినుకు పబ్లికేషన్స్, గాంధీ నగర్, విజయవాడ. జెఎస్ మూర్తి, హైదరాబాద్ 98480 25600

విహారి కథలలో 'కిటికీ తెరిస్తే' కనిపించేదంతా వర్తమాన మధ్యతరగతి జీవితమే సామాజిక స్థితిగతులను వాస్తవంగా చిత్రించడానికి ఉపకరించే గొప్ప సాహితీ ప్రక్రియ కథానిక. విహారిగారి ద్వాదశ కథానిక సంపుటాల్లో 'కిటికి తెరిస్తే' సంపుటి చివరిది. ఈ సంపుటిలోని కథలన్నీ వర్తమాన మధ్య తరగతి మానవ జీవితానికి సంబంధించినవి. మధ్య తరగతి కుటుంబ వ్యవస్థ, ఆ వ్యవస్థలోని వ్యక్తుల మధ్య ఉండే మనస్పర్థలూ, ప్రేమాభిమానాలూ, భిన్న వ్యక్తిత్వాలు, అన్నింటికి మించి ఆర్థిక సంబంధాల ప్రభావం మొదలైనవన్నీ విహారి కథల్లో ప్రధానాంశాలుగా అన్పిస్తాయి.

కార్పొరేట్ విద్యారంగం విద్యార్థుల భవిష్యత్తుతో ఏ విధంగా చెలగాటమాడుతుందో తెలియజెప్పే కథ 'కిటికి తెరిస్తే', మార్కులకు, ర్యాంకులకు మాత్రమే పరిమితమైన కార్పొరేట్ చదువు విద్యార్థుల్లో ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొనే శక్తిని, ఆత్మస్థైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని ఇవ్వడంలేదని రచయిత వాపోయారు. ర్యాగింగ్ సమస్య ఇతివృత్తంగా సాగిన కథ 'దృశ్యం-అదృశ్యం'. ర్యాగింగ్‌ను ఎదుర్కోలేక, జీవితాన్ని ఎలా గెలవాలో తెలియక ఆత్మహత్యను పరిష్కారంగా ఎంచుకొనే యువత మనోవేదనను రచయిత 'మాణిక్యం' పాత్ర ద్వారా, కళ్లకు కట్టినట్టు చూపించారు. మాధ్యమిక ప్రసారాలు, అంతర్జాలం యువతను ఏ విధంగా పెడత్రోవ పట్టిస్తున్నాయో తెలిపారు. 'బహుళరాగం' తప్పుదోవ పడుతున్న వైవాహిక సంబంధాల గురించి, భిన్న వైరుధ్యాలతో బతుకుతున్న మనుషుల వ్యక్తిత్వం గురించి రచయిత స్పష్టంగా తెలియజేశారు. నైతిక విలువలను విడిచిపెట్టి డబ్బుకు ప్రాధాన్యమిచ్చే ఈ లోకంలో మంచితనానికి, మానవత్వానికి కాసింత చోటుందని తెలియజెప్పే కథ 'చేయూత'.

చదివిన చదువు బతుకు తెరువును చూపలేక, నిరుద్యోగం వలలో చిక్కుకొని నైరాశ్యంతో జీవిస్తున్న ఒక యువకుని మానసిక సంఘర్షణే 'ఇదీ ముగింపు' కథ. ఆస్తుల కన్నా అనుబంధాలకి, ఆప్యాయతలకి ప్రాముఖ్యమివ్వాలని తెలిపే కథ 'నీకు తెలుసుగా నాన్నా'. నమ్మకం మీదే జీవితం ఆధారపడి ఉందని చెప్పే కథ 'అది చూపు ఇది నడక'.

ఆర్భాటం కోసం ధనాన్ని వృథా చేయకుండా ఆ డబ్బుతో అభాగ్యులను ఆదుకోవడం ద్వారా ఒక మంచి లక్ష్యం నెరవేరుతుందని చెప్పే కథ 'లక్ష్యం తోడు'. 'పట్టి మాటలు కట్టి పెట్టోయ్ గట్టి మేల్ తల పెట్టవోయ్' అన్న గురజాడ మాటలకు దృష్టాంతంగా ఈ కథ నిలుస్తుంది.

బి.టెక్ పాసైనా బతుకు తెరువు లేక, ఎలా జీవించాలో అర్థం కాక, మనోవేదన పడుతున్న ఓ నిరుద్యోగి కథ 'సహజాతులు'. 'బొరుసు' కథలో ఒక యువతి మనస్తత్వం, జీవితం పట్ల ఆమెకున్న ముందుచూపు కనిపిస్తుంది. వివాహం ముందర బావతో తనకున్న స్నేహం గురించి భర్త ముందు కూడా స్వేచ్ఛగా వ్యక్తం చేయగల ధైర్యం ఆమెకుంది. మనో విజ్ఞాన శాస్త్రం చదివిన ఆమె ఎదుటివారి మనస్సులను చదవడం, దానితో ఒక నిర్ణయానికి రావడం ఈ కథలో కనిపిస్తుంది.

రెక్కల కష్టంతో కొడుకు భవిష్యత్తుని తీర్చిదిద్ది చివరికి ఆ కొడుకు నిరాదరణకు గురైన మధ్యతరగతి మనిషి గాథ, వ్యథ 'ఆఖరి జవాబు'. వృద్ధులైన తల్లిదండ్రుల మంచీ, చెడు చూడాల్సిన బాధ్యత ప్రయోజకులైన పిల్లల మీద ఉందని తెలియజెప్పే కథ ఇది. విహారి కథలను బాగా పరిశీలించినట్లైతే ఒక కథ సమస్య వరకు పరిమితమైతే, వేరొక కథ సమస్యకు పరిష్కారం కూడా చూపిస్తుంది. కథల్లో వాస్తవికత అడుగడుగునా కన్పిస్తుంది. తనకున్న సామాజిక అవగాహనతో, విలక్షణమైన శైలిలో విహారి తన కథలను పాఠకునికి అందించారు. ఆద్యంతం ఆసక్తికరంగా సాగే కథనం, మంచి ఎత్తుగడ, సంక్షిప్తత, ఆశావహ ముగింపు మొదలగునవి విహారి కథలకి ఆభరణాలు.

-బొద్దూరు విజయేశ్వరరావు

అక్షరాలు ఎర్రబారాయి

రాచమళ్ల విరుగుడు కథలు
రచయిత: రాచమళ్ల ఉపేందర్
పేజీలు:88 వెల:40/-
ప్రతులకు: 8-3-264, యుపి హెచ్ కాలనీ, భానాపురం హవేలి, ఖమ్మం

ఈ కథా సంపుటి మేళ్ల చెరువు పరమయ్య-నాగరత్నం గార్లకు అంకితం చేశారు రచయిత. 'విరుగుడు' కథా సాహిత్యంలో మిణుగురు అంటూ చక్కటి ముందుమాట ఉంది. 10 కథలున్న ఈ సంపుటిలో బావి, విరుగుడు, కొత్త బంధం, అపూర్వ సమ్మేళనం, అమరజీవి, ఆత్మబంధువులు, రేపటికోసం, మంచి మనసులు, కూలిన శిఖరం లాంటి కథలు నేటి సమాజ దర్పణంగా ఉన్నాయి. ఉపేందర్ వసుధా కవి కావడంతో కొన్ని కొన్ని వాక్యాలు పాఠకుణ్ని వెంటాడుతాయి. ఉదా:- 'చెదలు పట్టిన చెట్టులాగున్నాడు'. రాత్రంతా ఏడ్చిన మేఘాలు ఇంకా దుఃఖం ఆడలేదు కాబోలు ఆకాశం నుండి అడపా దడపా చినుకులు రాల్తూనే ఉన్నాయి.(పేజి-17)

'నడిచేలో నిలబడి సూర్యుణ్ని మింగేసిన మేఘాలవైపు తలెత్తాడు రాముడు!' (పేజీ-34)

ఇలా ఎన్నో వాక్యాలు ప్రతి కథలో మెదళ్లను పదును పెట్టే రాచమళ్ల అక్షరాలు ఎర్రబారాయి. పురుగుల మందు వ్యాపారి గంగారాం పీడ వదిలించిన క్రికెట్ బ్యాట్‌ను కట్టెల పొయ్యిలో కాల్చేసిన కథనంలో వస్తు-శిల్ప-విన్యాసాలు 'విరుగుడు' కథకు బలం చేకూర్చుతాయి. గ్రామీణ వ్యవసాయ రైతు దంపతుల గాథ ఇది.

క్రూరుడైన రాముడిలో పరివర్తన కలిగించేందుకు అతని భార్య సరళ కూలిరైతు వీరయ్య ఆడిన నాటకం -పంచాయితీ. తీర్పు, వాస్తవాలు ఎరిగిన రాయుడిలో మార్పుతో కథ ముగుస్తుంది.

పదిరకుప్పం-కారంచేడు-నీరుకొండ చండూరు, వాకపల్లి, లక్ష్మాపురం, లాంటి ఘటనలకు భిన్నంగా ఈ 'కూలిన శిఖరం' కథా గమనం సాగింది. ఈ కథలన్నీ మానవీయ కోణాన్ని ఆవిష్కరిస్తూ చైతన్య స్రవంతిలా సాగాయి. - తంగిరాల చక్రవర్తి



'మనసుంటే మార్గముంటుంది' అనే నానుడి అందరికీ తెలిసిందే. ఎంత జటిలమైన సమస్యకైనా పరిష్కారం తప్పక ఉండి తీరుతుంది. మనం చేయాల్సిందల్లా మన వంతు ప్రయత్నం శక్తివంచన లేకుండా చేయడం. పర్యావరణం పట్ల తన బాధ్యత ఎరిగి, తనతోపాటు తనవాళ్ళను కూడా ఆ బాధ్యతలో పాలుపంచుకునేలా చేసి నేటి యువతరానికి ప్రతినిధిగా నిలబడిందో యువతి. తన పెళ్లి కానుకగా పదివేల మొక్కలను నాటాలని అత్తింటి వారిని అడిగి అతిథులందరి చేత తలా నాలుగు మొక్కలు నాటించిందీ పెళ్లికూతురు.

పెళ్ళి కానుకగా పది వేల చెట్లు

మధ్య ప్రదేశ్‌కు చెందిన 22 ఏళ్ళ ప్రియాంకా భదోరియా ఓ సైన్స్ గ్రాడ్యుయేట్. ఎంతో సామాజిక స్పృహ, చైతన్యం కలిగిన ఆమె తన అత్తింటివారిని విలక్షణమైన కోరిక కోరి అందరినీ ఆశ్చర్య చకితులను చేసింది. ఆమె కోరింది వజ్రవైఢూర్యాల్లో, ప్లాటినమ్ నగలో లేక పెద్ద మొత్తంలో డబ్బు కన్నా విలువైన పచ్చదనం. పర్యావరణపు చల్లదనం. అదుంటే తన కాపురం పచ్చగా కళకళలాడుతుందనేది ఆమె నమ్మకం కాదు.. పుట్టినింటి పరిస్థితి నేర్పిన కఠిన వాస్తవం. అత్తింటివారు పది వేల మొక్కలు నాటాలన్న ఆమె కోరిక ఏదో ప్రచారార్భాటానికో, నలుగురిలో ప్రత్యేకంగా నిలవాలన్న తపనదో కాదు సొంతూరి కరువుకు పరిష్కారం కోసం ఓ ఆడపడుచు వెంపర్లాట. ఎక్కువ మంది అత్తమామల మాదిరిగా వారు ఆ కోరికను విని చిర్రుబుర్రులాడటమో, తిరస్కరించడమో చేయలేదు. పైగా ఆమె కోరికను మంచి మనసుతో మన్నించి ఆనందంగా అంగీకరించారు. అంతేగాక పెళ్ళికుమారుడు రవి చౌహాన్ కూడా ఆమె కోరిన హరిత కోర్కెను మన్నించడంతో 2016 ఏప్రిల్ 22న వారిరువురూ ఒక్కటయ్యారు.ప్రియాంక స్వగ్రామం భింద్ జిల్లాలోని కిషిపుర. గ్వాలియర్-ఛంబల్ ప్రాంతంలో ఒక యువతికి వివాహం నిశ్చయమైన తరువాత నగలు గానీ, బంగారం గానీ పెళ్ళి కుమార్తె కోరిక మేరకు కానుకగా ఇవ్వాలనే ఆచారం ఉంది. కానీ ప్రియాంక మాత్రం అలాంటి విలువైన కానుకలకు బదులుగా పది వేల మొక్కల్ని నాటాలని కోరింది. ప్రకృతిని ఎక్కువగా చెట్టుచేమలతో తన వంతుగా సమృద్ధి చేయాలని నిర్ణయంలో భాగంగా ఆమె ఆ బహుమతిని కోరింది.   ఈ రకంగా విలక్షణమైన బహుమతిని కోరడం వెనుక బలమైన కారణం తన తండ్రేనని అంటుంది ప్రియాంక. నిరంతరం

క్షామంతో పోరాటం చేస్తూ.. ఎప్పటికప్పుడు పంట దిగుబడి తరిగిపోతున్నా వ్యవసాయాన్నే నమ్ముకున్న తండ్రిని చిన్నప్పటి నుంచి చూస్తూ పెరిగింది. ఈ సంక్షోభానికి కారణం ఆ ప్రాంతంలో పచ్చదనం తుడిచిపెట్టుకు పోవడం వల్లనే జరిగింది. అడవుల నరికివేత, పచ్చదనంతో కళకళలాడాల్సిన ప్రకృతి మోడువారి పోవడం, పంట పొలాలపై పడుతున్న ప్రభావాన్ని గుర్తుచేసింది భదోరియా. దీనికి ఆమె గ్రామం మినహాయింపు కాదు. భూగర్భ జలాలు ఇంకిపోతూ మధ్యప్రదేశ్ క్షామం కోరల్లోకి నెట్టబడుతోంది. ఈ పరిస్థితులు తండ్రిని ఎంతగా కుంగదీస్తున్నాయో ప్రత్యక్షంగా చూసింది. అనుభవించింది. చిన్న వయస్సులోనే మొక్కల పెంపకం ఆవశ్యకతను గుర్తించింది. తన పదవ ఏట నుంచే మొక్కలు నాటడం ప్రారంభించింది. ఇక్కడ ఆశ్చర్యకరమైన మరో విషయమేమంటే ఆమె వివాహం అంతర్జాతీయ ధరిత్రీ దినోత్సవంనాడు నిశ్చయమైంది.

చాలామంది పెళ్లి కూతుళ్లలా కాక...!

బంగారంపై పిచ్చి లేకుండా, అంతటి విలువైన నగల్ని కాదనుకుని పర్యావరణ పరిరక్షణ పట్ల ఇంత బాధ్యతాయుతంగా ప్రవర్తిస్తున్న భార్యను చూసి ఆమె భర్త రవి చౌహాన్ కూడా హర్షం వ్యక్తం చేస్తున్నాడు. తమ వివాహం అంతర్జాతీయ ధరిత్రీ దినోత్సవం రోజున నిశ్చయించడం పర్యావరణంతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేస్తున్నట్టయిందని సంతోషపడిపోయింది ప్రియాంక. తన పుట్టింట ఐదు వేల మొక్కలు, మెట్టినింట మిగిలిన ఐదు వేల మొక్కలు నాటాలని ఆమె తన వివాహ కానుకగా కోరింది. అంతేగాక రైతులు, సమాజ సేవకులు, మిగతా ప్రజలకు కూడా ఇంకా కొన్ని మొక్కలు పంపిణీచేసి వారికి తమ బాధ్యతను గుర్తు చేయాలని ఆమె భావిస్తోంది. నూతన వధూవరులు వధువు గ్రామం జలాన్‌కు ప్రయాణమయ్యే ముందు కిషిపుర గ్రామంలో మూడు మొక్కలు నాటారు. తాము రెండు మామిడి మొక్కలు నాటామని, మామిడి చెట్టు మనిషికి ప్రకృతి ప్రసాదించిన ఓ వరమని, ఇక ముందు కూడా ప్రతి పెళ్ళిరోజున తప్పకుండా మొక్కలు నాటుతామని ఈ కొత్త జంట ముక్త కంఠంతో చెబుతోంది. ఎంత గొప్ప ప్రయాణమైనా ఓ చిన్న అడుగుతోనే ఆరంభమవుతుంది. అలాగే ఎంతో గొప్ప సంకల్పాన్ని ఒక చిన్ని మొక్కతో ఆరంభించిన ప్రియాంక ఆ మొక్క ద్వారానే మనందరికీ ఉన్న బాధ్యతకు బీజం వేసింది. ఈ బాధ్యతను గుర్తించడంతో సరిపెట్టుకోకుండా తలా ఒక మొక్కను దేశంలోని ప్రజలందరూ నాటారంటే.. ఈ భూమి మళ్ళీ పచ్చని చెట్లతో కళకళలాడుతుంది. మన ముందు తరాలకు కనువిందు చేయడమేగాక వారి మనుగడకు మార్గమవుతుంది.

– సింహాద్రి నాగశిరీష

లెక్కల మాస్టారి నీటి లెక్క



నీరు లేక పంటలు పండని పరిస్థితులతో పాటు తాగేందుకు చుక్క మంచినీరు కూడా అందని తీవ్ర కరువు పరిస్థితులను ఎదుర్కొంటున్నారు లాతూర్ వాసులు. వేసవి ఎండలు గ్రామంలోకి పూర్తిగా ప్రవేశించక ముందే ఆ గ్రామంలో కుళాయిల్లో చుక్క నీరందని పరిస్థితులు తలెత్తాయి. నీళ్ల కోసం మైళ్ల దూరం వెళుతున్న గ్రామస్థులకి సాయపడాలను కున్నాడు మతీన్ మూసా. గ్రామం మొత్తం మీదా బోర్ పంపు మూసా ఇంటిలోనే ఉండటంతో గ్రామస్థులందరూ ఇప్పుడు నీటి కోసం అక్కడికే చేరుకుంటున్నారు. రోజు మొదలవగానే గ్రామస్థులందరూ కుల మతాలకు అతీతంగా మూసా ఇంటి ముందు నీటి కోసం క్యూ కడతారు. అందరినీ చిరునవ్వుతో పలకరించడమే కాకుండా తనే స్వయంగా క్యూలో ఉన్న వాళ్ల బిందెల్లో ఓపిగ్గా నీరు నింపుతాడు మూసా. ఆయన ఇలా ఏ వారం పదిరోజులుగా చేస్తున్నాడనుకుంటే పొరపాటే. మూడు నెలలుగా సొంత బోర్ ద్వారా నీటిని అందిస్తూ గ్రామస్తుల నీటి వెతలు తగ్గిస్తున్నాడు. వేసవి ప్రారంభమైన తొలి రోజుల్లో గ్రామస్తులు కుళాయిల ద్వారా వచ్చే నీటిని కొంత నిల్వ చేసుకునేవారు. ఇలా కొన్ని రోజులు, వారాల పాటు కొనసాగినా ఎండలు పెరిగే కొద్దీ నీటి వనరులు తగ్గడంతో గ్రామంలో రాను రాను తీవ్ర కరువు పరిస్థితులు మొదలయ్యాయి. లాతూర్ గ్రామంలోని అమన్ కాలనీలో సూరత్ షా ఉర్దూ పాఠశాలలో లెక్కల మాస్టారుగా పనిచేస్తున్న మూసా దృష్టికి గ్రామస్తుల నీటి సమస్య వచ్చింది. ప్రభుత్వాధికారులు ఇతరా ఆధారపడకుండా తన వంతు ఏం చేయగలనా అని ఆలోచించాడు.

వేసవి తాపానికి అల్లాడుతున్న ప్రాణాలు, గ్రామాల్లో ఇంకిపోతున్న బావులు వెరసి మహారాష్ట్ర పల్లె ప్రజల తీవ్ర నీటి ఇక్కట్లను మన కళ్లకి కట్టేలా చేస్తున్నాయి. వేసవి ఎండల కారణంగా ఇప్పటికే చాలా గ్రామాల్లో చెరువులు, బావులు, ఇంకుడు గుంటలు ఎండిపోయాయి. నీటి కుళాయిల్లోనూ నీరు రాకపోవడంతో లాతూర్ గ్రామంలో నీటి సమస్యను పరిష్కరించేందుకు నడుంబిగించాడు గ్రామానికి చెందిన షేక్ మతీన్ మూసా. అందుకోసం తన ఇంట్లోని బోర్ నుంచి దాదాపు పది వేల లీటర్ల నీటిని రోజూ గ్రామస్తులకి ఉచితంగా అందిస్తున్నాడు.

అప్పుడు గుర్తొచ్చింది తన ఇంటి నిర్మాణ సమయంలో తవ్వించిన బోరు గురించి. దాని ద్వారా నీటిని అందరికీ అందించడం మొదలు పెట్టాడు. గ్రామం మొత్తం మీదా ఉన్న ఒకే ఒక్క బోరు పంపు మూసాదే కావడంతో రోజూ వందలాది మంది వేలాది లీటర్ల నీటిని ఆయన ఇంటి నుండే తీసుకెళుతుంటారు. నీటి కోసం వచ్చేవారికి ఎలాంటి ఆంక్షలూ ఉండవు. గ్రామస్తులకి నీరందించడంలో రోజుకు 3-4 గంటల పాటు సాయపడుతుంటాడు. అంతే కాదు బోరింగ్ వాడకానికి అయ్యే కరెంటు చార్జీలను కూడా తానే స్వయంగా భరిస్తున్నాడు. నీటిని ఉచితంగా కాకుండా అందుకు కొంత డబ్బు తీసుకోవాల్సిందిగా కొందరు మూసాని కోరేవారు. అందుకు సమాధానంగా భూమి నుండి వచ్చే నీరు తన సొంతాస్తేం కాదంటాడు మూసా. అందరికీ చెందిన ఆ నీటిని తోడుకోవడానికి తన ఇంటిలో అవకాశం ఉండటమేనంటూ తేలిగ్గా తీసుకుంటాడు. నీరు అందరి ఆస్తి, ఒక వైపు గ్రామంలో ప్రజలు తాగడానికి కూడా నీరు లేక దప్పికతో అలమటిస్తుంటే డబ్బు తీసుకుని నీరందించే పని నేను చేయలేనంటూ ప్రతి విషయాన్ని వ్యాపార కోణంలో చూసేవారి కళ్లు తెరిపిస్తాడు. తమ గ్రామమే కాదు ఆ చుట్టుపక్కల ఉంటున్న ప్రాంతంలో తీవ్ర కరువు పరిస్థితులు నెలకొన్నాయి. అక్కడ నివసిస్తున్న 50 లక్షల మందికి రోజుకు 6 కోట్ల లీటర్ల నీరు అవసరమవుతుంది. దాదాపు ఒక్కో గృహానికి 100 లీటర్ల చొప్పున నీటి వాడకం ఉంటుంది. ప్రభుత్వం రైళ్ల ద్వారా ఈ ప్రాంతానికి నీరు అందిస్తుంది. లాతూర్ గ్రామానికి రోజూ నీటి ట్యాంకరు వస్తుంది. కానీ, ప్రతి కుటుంబానికి అందేది లీటరు నీరే. ప్రస్తుతం మూసా రోజుకు అందించే 10,000 లీటర్ల నీరే అక్కడున్న మూడొందల కుటుంబాలకి అధారమవుతోంది. నీటి ఎద్దడి పెరగడంతో గ్రామంలో నీటి వృధాని తగ్గించే దిశగా ఇప్పుడు రోజు విడిచి రోజు గ్రామస్థులకి నీరందిస్తూ జాగ్రత్తలు తీసుకుంటున్నాడు మూసా. ఊరి కష్టాన్ని అర్థం చేసుకుని స్వార్థం లేకుండా నీరందరిదీ అంటూ మానవత్వాన్ని చాటుకున్న మూసా అభినందనీయుడు. ఈ లెక్కల మాస్టారీ జీవితపు లెక్కలు అందరూ అర్థం చేసుకుంటే ఊళ్లు బాగుపడతాయి.

అభ్యర్థి ప్రత్యర్థి అతడే

బోట్లు బోట్లును నిలగట్టి
తనదారికి మళ్లించి
నడుస్తూ పరుగులు తీస్తూ
ప్రవాహమై నది ప్రవహిస్తోంది!
కోసుకు పోయిన కరకట్టలు
తీపులు తీస్తున్న గాయాల్తో
నదికి శాపనార్థాలు పెడుతున్నాయి!
తుడుచుకుపోయిన గడ్డివాములు
నేలకు ఒరిగిన చెట్లు
తిట్ల దండకం ఎత్తుకున్నాయి!
నిశ్చలంగా తపస్సు చేసుకుంటున్న
బండరాళ్లు స్థానభ్రంశం కలిగి
నదిని శపిస్తున్నాయి!
మానవాళి కోసం నా ప్రస్థానం
సాగుతుంటే
మనిషి నన్ను రణరంగం
చేస్తున్నాడంటూ
నది దుఃఖిస్తోంది!
ఆకసాన దండెంలేక
ఆరేసుకోను ఆధారంలేక
దండెత్తిన గాలి నన్ను ఛిద్రం చేస్తే
ముక్కలైన నూరుపును అతికించుకుని
వర్షిస్తున్నానంటోంది మేఘం!
మనిషి నీటిని పొదివి పట్టుకోనందుకు
మేఘం విచారిస్తోంది!
ఎదురు నిల్చిన కొండల్ని దాటి
అడ్డుకున్న వటవృక్షాల్లో దూరి
ఇంటింటికి విజయం చేసిననన్ను
బలవంతుడు ఏ.సిలో వాల్చి
విసిరేస్తున్నాడంటోంది గాలి!
మేలిమి శరీరాన్ని మలినం చేసినందుకు
వాయువు తల్లడిల్లుతోంది!
కొండంత చీకటికి
గోరంత వెలుగై నట్టింటి చీకటికి
దీపస్తంభమై గడ్డకట్టిన చీకట్లో ప్రజ్వలమై
మానవసేవ చేస్తున్నానంటోంది అగ్ని!
అడవుల్ని దహనం చేస్తూ
ఆడపడుచుల్ని కాలుస్తున్నందుకు
అగ్ని చింతిల్లుతోంది!
అభ్యర్థి ప్రత్యర్థి ఒకడే
విఘ్నం అవిఘ్నం ఒకటే!

అడిగోపుల వెంకటరత్నమ్
9848252946

ఆహ్వానం

మీ కవితలు పంపాల్సిన చిరునామా:
స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ.-520002.
మెయిల్ అడ్రస్
:snehaweekly.praja@gmail.com

రేయ్

కథ

మొలకలపల్లి కోటేశ్వరరావు
9963845840

"రేయ్ జానుగా.. ఎక్కడికిరా తాతా మనమడూ ఇద్దరూ ప్రయాణమయ్యారు?" బస్సులు ఆగే చోట, వేప చెట్టు కింద అరుగు మీద కూర్చుని, సిగరెట్ తాగుతూ జాన్‌ని అడిగాడు రాజారావు. "గుంటూరు ఎల్తన్నామయ్యా!" అన్నాడు జాను. "నీయమ్మ.. ఎందుకురా జానుగా?".

తాత వెంట ఉన్న మనవడు మనోహర్‌కి కడుపుమండిపోయింది. ఆ రాజారావు కంటే కూడా కాదు, ఆయన అబ్బ కంటే కూడా తన తాతకి ఎక్కువ వయసు వుంటుంది. ఎంత అహంకారం! "గుంటూరు కాలేజీలో చేరమని వాళ్లు వచ్చిపోయారయ్యా! ఈడూ ఆడ్నే చేరాలంటన్నాడు. మాట్టాడ్డానికి పోతన్నాం. కాలేజీ ఎట్ట వుండిద్దో, ఏందో చూడాలంట! ఎకాఎకిన పోలేంగా? చూసొచ్చి చేరతానంటున్నాడు. ఆ కాలేజీలూ, చదువులూ, చట్టుబండలూ నాకేం తెలుసు అనుకో! తోడుగారా.. తాతా అంటే ఎల్లటమేనేను! జీతంనాతం మాట్టాడాలి కదా?"

"నీయమ్మ! ఎందుకురా లేనిపోని ఎచ్చులూ? ఏదో ఒక పనిలో వెయ్యరా! అక్కర కొస్తాడు ఏడ్సీళ్లకి చన్నీళ్లు! నాకు తెల్సిన గ్రానైట్ కంపెనీ వుంది. సూపర్‌వైజర్ మనోడేలే! అక్కడ చేరుస్తా, చేర్చరా! నెలకి నాలుగైదు వేలు ఇస్తారు. ఏటికేడూ ఎంతో కొంత పెంచుతారు. కుటుంబం ఎల్లబారిపోయిద్ది!" "కాదు లే సామీ..! ఈడు చదువుకోవాలని గట్టి పట్టుదల మీద ఉన్నాడు. ఈడికి చదువంటే కూడా బాగా బెమ!"

"ఇయ్యాల అందరూ చదువుకోవటమే! ఉన్నోడని లేదూ, లేనోడని లేదూ! అంతా చదువుకుంటంటే ఉద్యోగాలు ఎక్కడ ఉన్నయ్యిరా? చదువయిం తరువాత రేపు రోడ్లంట తిరగాల్సిందే కదా? ఉద్యోగాలా సద్యోగాలా?"

"అదేం మాటసామీ?" అవునొరేయ్.. మీరు దేవుని బిడ్డల్రా! దేవుడికే కాదు, ఆ గవరమెంటుకి కూడా ముద్దు బిడ్డల్రా మీరూ! అన్ని పార్టీల నాయకులూ ఓట్ల కోసం, సీట్ల కోసం, పదవుల కోసం మీ చంకనాకుతుంటారు. మాట్టాడితే రిజర్వేషన్లూ, కదిలాడితే రిజర్వేషన్లూ, అదేమంటే రిజర్వేషన్లూ! చదువుల్లోనూ, ఉద్యోగాల్లోనూ, ఓట్లలోనూ, సీట్లలోనూ అన్నిటిలోనూ రిజర్వేషన్లే నాయె! ఇక చదువులు ఫ్రీ, హాస్టళ్లు ఫ్రీ, తిండి ఫ్రీ, గుడ్డలు ఫ్రీ, పుస్తకాలు ఫ్రీ! అన్నీ ఫ్రీ నే కదరా మీకూ! అసలు



గవరమెంటే మీదాయె!"

"ఊరుకోండి సామీ! మాలో నూటికో, కోటికో, ఎవుడో ఒకడు చదువుకుంటున్నాడేమొ! దానికే అట్టమాట్టాడితే ఎట్ట? మీ మాదిరిగా మేం పెట్టిపుట్టిన మారాజులం కాదుగా సామీ!"

"మీ పల్లె ధాటికి ఊరు ఏం తూగిద్దిరా ఇయ్యాల? మీ పల్లెలో ఎన్ని మోటారు సైకిళ్లు ఉన్నయ్యా, ఎన్ని మోపడ్లు వున్నయ్యా! ఓర్నాయినో.. అసలు ఒక్కొక్కడి దగ్గర ఎంతెంత డబ్బు వుందో?"

"ఎలక కాపరానికి పిల్లి ముచ్చట పడిందంట! మాకేం భూములా బాడవలా? మడులా మాన్యాలా? చేలా, చెట్లా, చెలకలా? మేం కూలికి పోక తప్పిద్దా, చాకిరీ చేసుకోక తప్పిద్దా, రెక్కలు యిరుచుకోక తప్పిద్దా, పనులకి పోక తప్పిద్దా? కూలికి పోతేనే కుండ మాడే లేకపోతే కడుపు మాడే! కూరలా, నారలా, పళ్లా, పచ్చళ్లా, కాయలా ఏయ్యో వూళ్ల మీద పడి తిరిగి అమ్ముకోవటానికో, పనుల కోసం దూరాభారం పోవటానికో నాలుగు బళ్లు కొనుక్కున్నంత మాత్రాన కుబేరులమై పోయినట్టేనా సామీ? భూసాములం అయిపోతామా?"

"ఇయ్యాల పల్లె ఊరుని కొనేటట్టుగా వుంది. సరే కానీయండి! నువ్వు ఏం గ్రూపు తీసుకుంటున్నావురా అయితే?" మనోహర్‌ని అడిగాడు రాజారావు.

"బైపీసీ!" "హబ్బో... డాక్టర్ కోర్స్ చదవడానికే! పెద్దచూపేనే! అది నీకు ఈ జన్మలో అయ్యే పనేనా? ఓరి నీ ఆశ పాడుగానూ! ఎంత ఆశరా! నీవల్లయిద్దీ? పదిలో అయితే ఏదో పాటు కుదిరిందీ, ఎట్నో మార్కులు వచ్చినయ్యి! రేపురా ఇట్నే పాటు కుదిరిద్దంట్రా?"

మనోహర్ మౌనంగా వున్నాడు.

"నా మాట విని ఎంపీసీ తీసుకోరా!"

"మీ సలహా అక్కర్లేదు!"

"ఒరేయ్.. నీ మనువడి దగ్గరా చాలానే ఉందిరా జానుగా! నేను ఇంకేమో అనుకున్నానే! బాగా మదపోడులాగ ఉంది. బళ్లో పంతుళ్లు కూడా ఈడు తల బిరుసోడు అంటే నేన్నమ్మలా!

మంచోడే! ఇట్ట అయితే ఈడు బాగానే కడ తేరతాడు!"

ఇంతలో నిండుగా జనంతో బస్ వచ్చింది. కొందరు దిగారు. తాతామనవడూ ఇద్దరూ బస్ ఎక్కారు. సీట్లో కూర్చున్నారు.

"దొంగ నా..! వాడికి ఎంత పొగరూ! వళ్లంతా కుళ్లే తాతా వాడికి! "

"ఆ మాట ఏంది నాయనా మనోహరూ! పెద్దంతరం, చిన్నంతరం వుండాలయ్యా! వాళ్ల మన ఇంటి ఆసాములు! వాళ్ల ఇంటి మాదిగలం మనం ఎనకట్నించీ వాళ్ల పొలాల్లో పనులు చేసి బతికినోళ్లం! మా తాత ముత్తాతల కాలం నించీ వాళ్లకి చాకిరీ చేస్తూనే మనం బతికింది! వాళ్ల తిండి పెట్టి మనల్ని బతికించారు!"

"వాళ్లకి చాకిరీ చేస్తే కాదు.. తాతా మనం బతికిందీ, మనం చాకిరీ చేస్తేనే వాళ్లు బతికింది! వాళ్లు మనకి తిండి పెట్టి బతికించలా, మనమే తిండి పెట్టి వాళ్లని బతికించాం! మనం పనులు చేయకపోతే, చాకిరీ చేయకపోతే వాళ్లకి పంటలు పండేవేనా? వాళ్లు పెద్దోళ్లు అయ్యే వాళ్లేనా?"

"నువ్వు తెలివి కలిగిన వాడివి అయితే అయ్యావు కానీ ఇతండ వాదం చేయవాకురా!" అన్నాడు తాత.

రాజారావు కొడుకు ప్రవీణ్, మనోహర్ ఇద్దరూ ఒకటే క్లాస్. మొన్ననే ఇద్దరికీ పదో క్లాస్ అయిపోయింది. ఇద్దరూ హైస్కూల్లోనే. రాజారావు పెద్ద రైతు. చాలా పొలం వుంది. ఒక్కడే కొడుకు ప్రవీణ్. వాడ్ని బాగా చదివించాలని రాజారావు కోరిక. గుడివాడ, గుంటూరు, ఒంగోలు ఇలా చాలా చోట్లకి వాడ్ని చదువుల కోసం తిప్పాడు. పసితనంలోనే! వాడు ఎక్కడా ఉండలేకపోయాడు. వాడి చదువు కోసం ఒక ఏడాది టౌన్‌లో కాపురం పెట్టాడు. టౌన్‌కి మకాం మార్చటంతో ఇక్కడ వ్యవసాయం, సేద్యం కుంటుబడిపోయింది. తిరిగి ఊరికి చేరుకుని, వూళ్లోనే హైస్కూల్లో వేశాడు. ఆయనకి ఎప్పుడూ కొడుకు చదువు రంధే! ఇప్పటికిప్పుడే కలెక్టర్ని చేయాలనో, అమెరికా పంపించాలనో అమితోత్సాహంతో ఉన్నాడు. టెన్త్‌లో మనోహర్, ప్రవీణ్ మొదటి రెండు ర్యాంకుల్లో ఉండేవాళ్లు. చదువులో ప్రవీణ్, మనోహర్‌ని పోటీగా భావించేవాడు. అయితే అతను మనోహర్‌కి మాత్రం పోటీ కాదు. మనోహర్‌కి మంచి తెలివితేటలు ఉన్నాయి. చాలా చురుకుదనం వుంది. పోటీ ఆలోచన లేకుండా మనోహర్ తనపాటికి తను చదువుకునేవాడు. ప్రవీణ్‌కి ఎలాగైనా మొదటి ర్యాంకు తెచ్చుకోవాలనే తపన, తాపత్రయం, మనోహర్‌తో తను నెగ్గలేడు. అభద్రతా భావన. ఆ భావనకి కుల అహంకారం తోడైంది. తను అగ్ర కులం అనే పొగరు. గర్వం! మనోహర్‌ని చాలా తక్కువుగా చూసేవాడు,



కించపరచడానికి ప్రయత్నించేవాడు. హీనపరిచేవాడు. అతని మాటల్ని మనోహర్ పట్టించుకునేవాడు కాదు. అతనికి ఏమీ విలువ ఇవ్వకుండా చదువులోనే లీనమయ్యేవాడు. రాజారావు వారానికి రెండు మూడు రోజులు హైస్కూల్ దగ్గరకి వచ్చేవాడు. టీచర్లని కలిసేవాడు. కొడుకు చదువు విషయం టీచర్లతో మాట్లాడేవాడు. ఆయనకి కొడుకు చదువు తపనే! ఆయన స్థితిమంతుడు కావడంతో టీచర్లకి కూడా ఆయనంటే గౌరవం, అభిమానం.

కులం. ఇది బాగా పనిచేసింది. ఒక్క పిఎస్ టీచర్ మినహా, మిగతా టీచర్లు అందరూ కూడా ప్రవీణ్ వైపే! పైగా ప్రవీణ్ ఎర్రగా, బుర్రగా, సుకుమారంగా వుంటాడు. తాతల కాలం నించే సుఖంగా, నీడ పట్టున, ఎండ పొడ తగలకుండా పెరిగిన కుటుంబం.

మనోహర్ తాతల నించీ ఎండలో మాడిమాడి మసై పోయిన రంగు!

పరీక్షల్లో ప్రవీణ్‌కి వీలైనన్ని ఎక్కువ మార్కులు వేయడానికీ, మనోహర్‌కి వీలైనంతగా మార్కులు తగ్గించడానికీ ప్రయత్నించే వాళ్ళు. ఎలాగైనా మనోహర్‌కి కాకుండా ప్రవీణ్‌కి మొదటి ర్యాంక్ తెప్పించాలని టీచర్ల ప్రయత్నం.

పీఎస్ సార్ ఒక్కడే న్యాయంగా వుండేవాడు. ప్రవీణ్‌కీ, వాళ్ళ నాన్నకీ అది నచ్చలేదు. ఒకసారి పీఎస్ పరీక్షలో ప్రవీణ్ పేపర్ వాల్యూయేషన్ చేయడంలో పొరపాటు జరిగింది. సార్ రెండు మార్కుల ప్రశ్నకి మార్క్స్ వేయలేదు. ఏదో పరధ్యానంలో, పొరపాటుగా దానిని చూడలేదు. వెంటనే ప్రవీణ్ వాళ్ళ నాన్నకి చెప్పాడు. ఆయన కొంపలు అంటుకు పోయినట్లే ఆగమేఘాల మీద వచ్చాడు. పీఎస్ సార్ మీద తగాదా పెట్టుకున్నాడు.

"అదెంటి సార్ మీరూ? ఆ మనోహర్‌గాడికి ఎక్కువ మార్కులు వేయడం ఏమిటీ, మా వాడికి కావాలని మార్కులు తగ్గించి వేయడం ఏమిటీ? మెరిట్ స్టూడెంట్‌ని ఇలా నిరుత్సాహ పరిస్తే ఎలా సార్? మీరు మొదట్నించీ కూడా చాలా పక్షపాతంతో వున్నారు. మీ పద్ధతేం బాగలేదు సార్! మీ విషయంలో మావాడు ఎంత బాధపడుతున్నాడో! తండ్రి లేని పిల్లవాడని ఆ మనోహర్‌గాడి మీద జాలిపడి, మావాడి కంటే ఎక్కువ మార్కులు వేస్తున్నారు. మీకు అంతగా జాలే వుంటే వాడికి డబ్బులో, బట్టలో ఏవో ఇవ్వండి! అంతేకానీ ఎడ్యుకేషన్‌లో పక్షపాతం

చూపెడితే ఎలా? మీరు ప్రతి పరీక్షలోనూ మా వాడికి విరగ్గోసి, వాడికి కావాలని ఎక్కువ మార్కులు వేస్తున్నారు. మీరు అసలు చదువు చెప్పే టీచరేనా? అడ్డదిడ్డంగా మాట్లాడుతూ, పెద్దగా తగాదా పెట్టుకుని గొడవ చేశాడు రాజారావు. హెడ్మాస్టర్ వచ్చి సరిపుచ్చి, సారీ చెప్పి పంపించాడు. జిల్లాలో జరిగే క్విజ్ పోటీలలో, టాలెంట్ టెస్ట్‌లకీ, స్కూల్ నించి ఒక టీమ్ అనుమతి వుంటే ప్రవీణ్‌నే ఆ టీంలో పాల్గొనే అవకాశం లభించేది. రెండు టీములు అయితేనే, అప్పుడు మనోహర్ రెండో టీంలో వెళ్ళేవాడు. మొదటి బహుమతీ తీసుకువచ్చేవాడు. పది కావడంతో మనోహర్ ట్యూషన్ చేరాడు. ట్యూషన్‌లో కూడా వివక్షే! రాజారావు ప్రతి రోజూ రాత్రి ట్యూషన్ దగ్గరికి వచ్చేవాడు. కొడుకు చదువు పర్యవేక్షణ!

ఒకరోజు రాత్రి ట్యూషన్ పిల్లలు అందరూ చదువుకుంటున్నారు. రాజారావు కొడుకుని తీసుకుపోవడానికి ట్యూషన్ దగ్గరికి వచ్చాడు. లోకంలో అందరి కంటే ఆయన కొడుకు తెలివిగలవాడనే ఉద్దేశం ఆయనది. ట్యూషన్ సార్‌తో కొడుకు చదువు కబుర్లు మొదలుపెట్టాడు. "మా వాడికి అసాధారణమైన తెలివితేటలు ఉన్నాయండీ! పూర్తి ఎఫర్ట్ పెట్టి చదవడు కానీ, చదివితేనా జిల్లాలోనే మొదటి ర్యాంక్ కొట్టగలడు. వాడికి ఎంతసేపూ టీవీ పిచ్చీ, ఆటల పిచ్చీ, క్రికెట్ పిచ్చీ! హై స్కూలు మాస్టార్లు కూడా ఇదే మాట అంటారు. మనోహర్ గాడికి ఏం తెలివితేటలు ఉన్నాయండీ? వాడు ఎంతసేపూ బట్టీ పట్టడమేనాయె! రుబ్బుడు సరుకు! రుబ్బిందే రుబ్బుతుంటాడు. మా వాడికీ, వాడికీ ఎక్కడ పోలిక! ఒరిజినల్ తెలివితేటలు మావాడివి!" ఆయన మాటలకి ట్యూషన్ సార్ నవ్వుతూ తలూపాడు. తల వంచుకుని చదువుతున్న మనోహర్ ఆ మాటలు విన్నాడు. ఆ మాటలతో రాజారావు అంటే అసహ్యం, కోపం, కసి, ద్వేషం, క్రోధం రెట్టింపైంది. చివర్లో జరిగే పబ్లిక్ పరీక్షల్లో కులం చూడరు. వాళ్ళకి పేపర్లో కులం తెలియదు. అక్కడే న్యాయం జరుగుతుంది. పట్టుదలతో ఇంకా బాగా చదవడం మొదలుపెట్టాడు.

మనోహర్ పసి మనసు మీద అనేక గాయాలు! అనేక అనుభవాలు! అనేక సంఘటనలు! అనేక గుర్తులు! వాటితో కులం అంటేనూ, అగ్ర కులం అంటేనూ అసహ్యం ఏర్పడేలా చేసాయి. ఒకసారి వాళ్ళ అమ్మకి రావాల్సిన కూలి డబ్బులు కోసం ఊళ్ళో ఒక రైతు ఇంటికి వెళ్ళాడు మనోహర్. తను వెళ్ళిన సమయానికి, తమ పల్లెలోని అంకెళ్ళ సుబ్బయ్య కూడా వాళ్ళ ఇంటికి వచ్చాడు. ఆ రైతు కూతురు, పదేళ్ళ అమ్మాయి. "రేయ్ సుబ్బాయ్.. మా అమ్మలేదు. ఊరికి పోయింది కానీ బోరింగ్ కాడికి పోయి రెండు బుంగలు నీళ్ళు తెచ్చిపెట్రా!" అంది. పదేళ్ళ అమ్మాయి! 60 ఏళ్ళ సుబ్బయ్యని! వాళ్ళ ఇంటి మాదిగ ఆయన! బుంగలు తీసుకుని నీళ్ళు తీసుకురావడానికి వెళ్ళాడు ఆయన. ఆ రోజుల్లోనే తను మరో విషయం గమనించాడు. తమ కులంలోని మనుషుల్ని ఊళ్ళో వాళ్ళు ఎవరూ పేరుతో పిలవరు.

సుబ్బయ్య అయితే సుబ్బయ్... సుబ్బిగా... సుబ్బిగాడు... సుబ్బడు.

రామయ్య అయితే రామయ్... రామగా... రామిగాడు... రాముడు.

వెంకయ్య అయితే ఎంకాయ్... ఎంకిగా... ఎంకిగాడు... ఎంకడు.

వీరయ్య అయితే ఈరాయ్... ఈరిగా... ఈరిగాడు... ఈరడు.

యల్లయ్య అయితే ఎల్లాయ్... ఎల్లిగా... ఎల్లిగాడు... ఎల్లడు.

తన తాత పేరు జాన్ అయితే జానాయ్.... జానుగా... జానుగాడు.. జానడు!

ఇలా తమ పేర్లని తుంచీ, హీనం చేసి, కుదించీ, గాడు, గీడు, గాతాయాలు తగిలించి అగౌరవంగానూ, అవమానకరంగానూ పిలవడం వాళ్ళ పద్ధతి! అది వాళ్ళకి గౌరవం! వాళ్ళకి కీర్తి! అది వాళ్ళ హోదాని తెలియచేయడం! కుల అహంకారాన్ని వ్యక్తపరచడం! అది వాళ్ళ సంస్కారం! ఎన్నో తరాలుగా! కాలం కరిగిపోతోంది. అది దాని లక్షణం కదా! కాలం మారి కూడా పోతోంది! అదే దాని లక్షణమే!

తరాలు మారిపోతున్నాయి! తరాల ఆలోచనలూ మారుతున్నాయి.

మనోజ్, ప్రవీణ్ ఇద్దరికీ ఇంటర్మీడియట్ అయిపోయింది. ఇద్దరూ ఎంసెట్ రాశారు.

మనోహర్‌కి ఎంసెట్ మెడిసిన్ విభాగంలో 148వ ర్యాంక్ వచ్చింది. ప్రవీణ్‌కి ఇంజనీరింగ్ విభాగంలో 17 వేలల్లో ర్యాంక్ వచ్చింది. ఇంకా ప్రవేశాలు జరగలేదు.

మనోహర్ తాత జాన్‌కి ఆరోగ్యం బాగాలేదు. ఆస్పత్రిలో చూపెట్టాలి. బస్తీలోని ఆస్పత్రికి తీసుకుపోవడానికి తాతని బస్సులు నిలిచే చోటుకి తీసుకువచ్చాడు మనోహర్.

అక్కడ వేప చెట్టు కింద అరుగు మీద కూర్చుని వున్నాడు రాజారావు. పనీపాటా లేనివాళ్ళు అక్కడ కూర్చుని, వచ్చే పోయే ప్రయాణీకుల్ని చూస్తూ కాలక్షేపం రాజకీయాలు, పోసుకోలు విషయాలు మాట్లాడుకుంటూ పొద్దు పుచ్చుతుంటారు.

"ఏరా జానుగా... తాతా మనవడు ఎక్కడికి బయల్దేర్రా?" తాతని ప్రశ్నించాడు రాజారావు.

దగ్గుతూ సమాధానం చెప్పాడు తాత.

"నీకు ర్యాంక్ ఎంత వచ్చిందిరా?" మనోహర్‌ని అడిగాడు.

రాజారావు, ఆయన కొడుకు తనని అనేకసార్లు అవమానించారు హేళన చేసారు. కించ పరిచారు. వాళ్ళంటేనే తనకి కసిగా వుంది.

ఇలాంటి వాళ్ళే, తరతరాలుగా తన ముత్తాతలు, తాతల, తండ్రుల నించీ తమ జాతి మొత్తాన్ని, వయసు వ్యత్యాసాల్ని కూడా చూడకుండా హీనంగా, నీచంగా పిలవగా.. తను ఒక్కసారి, ఒకే ఒక్కసారి పిలిస్తే...

"149వ ర్యాంక్ వచ్చిందిరా రాజిగా? వినపడిందా? ఏరా... రేయ్!"

✦

కథలకు ఆహ్వానం

ప్రజాశక్తి ఆదివారం అనుబంధం స్నేహ కథలకు ఆహ్వానం పలకుతోంది. మంచి కథలను ఎంపిక చేసి ప్రచురిస్తాం. కథ సమకాలీన పరిణామాలు, పరిస్థితుల నేపథ్యంగా వుండాలి. ప్రపంచీకరణ నేపథ్యంలో వివిధ రంగాల్లో చోటు చేసుకున్న, చేసుకుంటున్న విపరిణామాలను కథాంశంగా తీసుకోవచ్చు. ప్రగతిశీల చైతన్యాన్ని, ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించే కథలకు ప్రాధాన్యత. మూఢనమ్మకాలు పెంచేవిగా, ఏ సామాజిక తరగతిని ప్రత్యేకంగా నొప్పించేదిగా వుండకూడదు. మాండలికాలు ఉపయోగించినా కథన శైలి అందరికీ బోధ పడేలా వుండాలి. నవ్యత, వైవిధ్యం కలిగిన కథలకు ప్రత్యేక ఆహ్వానం.

నిబంధనలు

కథ నిడివి ప్రింటులో మూడు ఎ4 కాగితాల్లో వుండాలి. చేతిరాతలో అయితే 8 నుంచి 10 కాగితాల్లో వుండాలి. ప్రింటయినా, చేతిరాతైనా కాగితానికి ఒకవైపు మాత్రమే వుండేలా... జిరాక్స్ ప్రతిని పంపాలి. కథలను తిప్పి పంపడం వుండదు. పేరు, పూర్తి చిరునామా, ఫోన్ నెంబరు తప్పక రాయాలి. మా చిరునామా: స్నేహ, ప్రజాశక్తి దినపత్రిక, హౌస్ నెం. 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.

మెయిల్ అడ్రస్:

snehaweekly.praja@gmail.com

-ఎడిటర్

మంగళూర్ స్పెషల్స్



ఫిష్ కట్‌లెట్

తయారుచేసే విధానం

ముందుగా నీటిలో ఉప్పు, పసుపు వేసి చేపల్ని శుభ్రంగా కడిగి నీరు లేకుండా ఒక డిష్‌లో పెట్టాలి. వాటిపై జీలకర్ర పొడి, కారం, పసుపు, ఉప్పు, నిమ్మ రసం వేసి 20 నిమిషాల పాటు పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు ప్యాన్‌లో కొద్దిగా నూనె వేసి వేడెక్కిన తర్వాత అల్లం తరుగు, పచ్చిమిర్చి వేసి వేయించాలి. తర్వాత ఉల్లి తరుగు కూడా వేసి మరి కొంత సేపు వేయించాలి. అందులో కొత్తిమీర, పుదీనా కూడా వేసి మంచి సువాసన వచ్చే వరకు ఉంచి నిమ్మ రసం, కారం, జీలకర్ర పొడి వేసి రెండు నిమిషాలు వేయించాలి. ఈ మిశ్రమాన్ని ఒక బౌల్‌లోకి తీసుకుని చల్లారనివ్వాలి. ఇప్పుడు ఒక మందపాటి గిన్నెలో చేప ముక్కలు వేసి బాగా ఉడికించుకోవాలి. చేపల్లో ఉన్న తడి మొత్తం ఇగిరే వరకు ఉడకనిచ్చి తర్వాత ఒక ప్లేట్‌లోకి ఈ ముక్కల్ని తీసుకుని పక్కన పెట్టుకోవాలి. చేప ముక్కలు చల్లారాక చిన్న చిన్న ముక్కలుగా గానీ లేదా మిక్సీ జార్‌లో వేసి మెత్తగా బ్లెండ్ చేసుకోవాలి. చేపల పేస్ట్/ ముక్కల్ని, ఉల్లిపాయల మిశ్రమంలో వేసి బాగా కలుపుకోవాలి. ఉప్పు సరిచూసుకుని ఈ మిశ్రమాన్ని ఉండలుగా చేసి పక్కన పెట్టుకోవాలి. ఉండలు సరిగా కుదరక పోతే బ్రెడ్ ముక్కల్ని కొద్దిగా తడిపి వాటిని చేప ముక్కల మిశ్రమంలో కలిపితే ఉండలు ఏర్పడతాయి. ఉండల్ని చేత్తో వత్తి గుడ్డు తెల్ల సొనలో ముంచి ప్యాన్‌పై గోధుమ రంగు వచ్చే వరకు రెండు వైపులా వేయించాలి. ఇప్పుడు సర్వింగ్ ప్లేట్‌లోకి వేడి వేడి ఫిష్ కట్లెట్‌లని తీసుకుని ఉల్లిపాయ ముక్కలు, కొత్తిమీర, పుదీనాలతో గార్నిష్ చేసి టమాటా సాస్‌తో రుచి చూడండి.

కావాల్సిన పదార్థాలు

ముళ్లులేని చేపముక్కలు - 500 గ్రాములు
జీలకర్ర పొడి - 2 టేబుల్ స్పూన్లు
కారం - 2 టేబుల్ స్పూన్లు
పసుపు - 1/2 టేబుల్ స్పూన్
నిమ్మరసం - 2 టేబుల్ స్పూన్లు
ఉప్పు - సరిపడా
నీరు - 1 కప్పు
బ్రెడ్ ముక్కలు - 1
గుడ్లు - 2
నూనె - తగినంత
ఉల్లిపాయలు - 2
పచ్చిమిర్చి - 3
అల్లం తరుగు - 2 టేబుల్ స్పూన్లు
కొత్తిమీర తరుగు - 5 టేబుల్ స్పూన్లు
పుదీనా తరుగు - 2 టేబుల్ స్పూన్లు

ఎండు రొయ్యల పచ్చడి

కావాల్సిన పదార్థాలు



ఎండు రొయ్యలు - 50 గ్రాములు
కొబ్బరి తురుము - 3 టేబుల్ స్పూన్లు
పచ్చిమిర్చి - 5
జీలకర్ర - 1/2 టేబుల్ స్పూన్
పసుపు - 1 టీ స్పూన్
చింతపండు పేస్ట్ - 1/2 టేబుల్ స్పూను
ఉల్లిపాయ - 1
నూనె - సరిపడా
ఉప్పు - తగినంత

తయారుచేసే విధానం :

ముందుగా రొయ్యల్ని శుభ్రంగా కడిగి తడి లేకుండా ఆరనివ్వాలి. ఒక బాణలిలో నూనె వేసి రొయ్యల్ని దోరగా వేయించి పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు కొబ్బరి తురుమును వేయించి పెట్టుకున్న రొయ్యల్ని కూడా ఇందులో కలిపి రెండు నిమిషాలు వేయించాలి. ఎండు మిర్చి, జీలకర్రని పొడి చేసి, చింతపండు పేస్ట్‌తో కలిపి రొయ్యల మిశ్రమంలో కలపాలి. ఈ మిశ్రమాన్ని మిక్సీ జార్‌లో వేసి బ్లెండ్ చేసుకోవాలి. మరీ మెత్తగా కాకముందే జార్‌లోంచి తీసి ఒక బౌల్‌లో పెట్టాలి. తర్వాత కొద్దిగా ఉల్లిపాయ ముక్కల్ని తీసుకుని గోధుమ రంగు వచ్చే వరకు వేయించి రొయ్యల పచ్చడిలో కలపాలి. వేడి వేడి అన్నంలో ఈ పచ్చడి రుచిగా ఉంటుంది.

మటన్ పలావ్

కావాల్సిన పదార్థాలు

మటన్ - 1 కేజీ
బాస్మతి బియ్యం - 1 కప్పు
పుదీనా ఆకులు - 1/2 కప్పు
కొత్తిమీర తరుగు - 1/2 కప్పు
నూనె - 3 టీ స్పూన్లు
అల్లం-వెల్లుల్లి పేస్టు - 2 టీ స్పూన్లు
పసుపు - 1/2 టీ స్పూను
జీలకర్ర - 1 టేబుల్ స్పూను
నిమ్మ రసం - 1 టీ స్పూను

మసాల కోసం
జీలకర్ర - 1 టేబుల్ స్పూన్
సోంపు - 1 టేబుల్ స్పూన్
పచ్చిమిర్చి - 6
ఉల్లితరుగు - 1/2 కప్పు
ఉప్పు - తగినంత

తయారుచేసే విధానం : ముందుగా మటన్‌ని శుభ్రంగా కడిగి పెద్ద ముక్కలుగా కట్ చేసుకోవాలి. ఇప్పుడు ఒక బౌల్‌లో మటన్ ముక్కల్ని ఉంచి అందులో పసుపు, సోంపు, నిమ్మ రసం, పుదీనా ఆకులు, మసాలా దినుసులు, కొత్తిమీర తరుగు వేసి బాగా కలిపి మూడు గంటల పాటు ఉంచాలి. తర్వాత కుక్కర్‌లో మటన్ ముక్కలు, కొద్దిగా నీరు, పచ్చిమిర్చి, ఉప్పు వేసి నాలుగు విజిల్స్ వచ్చే వరకు ఉడకనివ్వాలి. మటన్ ఉడికిన తర్వాత నీటి నుండి వేరుచేసి ఒక బౌల్‌లో వేసి పక్కన పెట్టుకోవాలి. బియ్యాన్ని కడిగి అరగంట సేపు నాననివ్వాలి. ఇప్పుడు ఒక ప్యాన్‌లో నూనె వేసి వేడెక్కిన తర్వాత జీలకర్ర, సోంపు మిగిలిన దినుసులన్నిటితో పాటు ఉల్లి తరుగును కూడా వేసి వేయించాలి. అందులో అల్లం-వెల్లుల్లి పేస్టును కూడా వేసి వేయించాలి. ఇప్పుడు మటన్ ముక్కలు, పచ్చిమిర్చి ముక్కలు, కొత్తిమీర తరుగు, పుదీనా ఆకులు, నానబెట్టిన బియ్యాన్ని కూడా వేసి బాగా కలపాలి. మిగిలిన మటన్ ముక్కలు, ఉప్పు కూడా వేసి పది నిమిషాల పాటు ఉడకనివ్వాలి. తర్వాత కొద్దిగా తక్కువ మంటపై పదార్థాలన్నీ ఉడకనివ్వాలి. ఇక వేడి వేడి పలావ్‌ని సర్వింగ్ ప్లేట్స్‌లోకి తీసి సర్వ్ చేయండి.



బొమ్మలు పూరించండి

పిల్లలూ! మీకు బొమ్మలు గీయడమంటే ఎంతో ఇష్టం కదూ! మీ కోసం ఆర్టిస్ట్ అంకుల్ ముందుగా ఒక బొమ్మని సగం గీసి ఉంచాడు. మీరు మిగిలిన భాగాన్ని జాగ్రత్తగా పూర్తి చేయండే!



పదాలు గుర్తించండి

ఇక్కడున్న సీతాకోక చిలుకలో కొన్ని అక్షరాలు ఉన్నాయి. ఆ అక్షరాల్లో పదాలు ఎక్కుడున్నాయో గుర్తించి పెన్‌తో మార్క్ చేయండి.



లిటిల్ స్టార్

హాయ్ ఫ్రెండ్స్! నేనొక క్రికెట్ స్టార్‌ని! ఇది నా చిన్ననాటి ఫోటో. ఇంతకీ నేనెవరో చెప్పండి?

జ: సురేష్ రైనా

ఏ నీడ ఎవరిది

పిల్లలూ! ఇక్కడ కొన్ని జంతువులు వాటి నీడలు ఉన్నాయి. ఏ జంతువు నీడ ఎక్కుడుందో గుర్తించి వాటిని జత చేయండి.

ఆకులతో బొమ్మ

మనింటి ముందు రాలి పడిపోతుండే పచ్చి ఆకులతో బొద్దింక బొమ్మ ఎలా చేయొచ్చో ఇక్కడ ఇచ్చాం. మీరూ ప్రయత్నించండి.



తేడాలు గుర్తించండి

ఈ రెండు బొమ్మల్లో ఐదు తేడాలు ఉన్నాయి. వాటిని మీరు గుర్తించి సున్నా చుట్టేయండి.



కనిపెట్టండి

అగ్గిపుల్లలతో చేసిన ఒక ఆకారాన్ని ఇక్కడుంచాం! దానిలో రెండు అగ్గి పుల్లల్ని కదిలిస్తే రెండు దీర్ఘ చతురస్రాలు ఏర్పడతాయి. అదెలాగో కనిపెట్టండి.



వింత పక్షి

పిల్లలూ! ఇక్కడున్న పక్షి పేరేంటో మీకు తెలుసా? పెద్ద కళ్లు, పదునుతేలిన ముక్కు ఉన్న ఈ పక్షిని చూడగానే గుడ్లగూబ అనుకుంటారు. ఔల్ ప్యారెట్ 'అని కొంతమంది పిలిచినా వీటి అసలు పేరు కకాపొ. న్యూజిల్యాండ్‌లో మాత్రమే కనిపించే అతి పురాతనమైన చిలుక జాతికి చెందిన పక్షులు కకాపొలు. పగలంతా చెట్లు, నేలపైనే గడిపేస్తూ రాత్రి పూట మాత్రమే తిరుగుతుండే కకాపొలకి నైట్ బర్డ్ అనే పేరుకూడా ఉంది. అన్ని పక్షుల కంటే వీటి రెక్కలు ఎంతో మృదువుగా ఉంటాయి. అయితే ఇవి ఇతర పక్షులలాగా ఎక్కువ ఎత్తుకి ఎగరలేవు. బలంగా ఉండే వీటి కాళ్ల సాయంతో వందల మైళ్ల పరుగెడుతుంటాయి కకాపొలు. అతి బరువైన పక్షుల్లో కకాపొ ఒకటి. గద్దల నుండి వీటికి ఎక్కువగా ప్రమాదం ఉండటంతో ప్రమాదాన్ని గమనించినపుడు ఇవి అచేతనంగా ఉండిపోతాయి. లేదా వీటి రెక్కల సాయంతో చెట్టు తొర్రల్లో దూరి తమని తాము కాపాడుకునే ప్రయత్నం చేస్తుంటాయి. వాసన ద్వారా పరిసరాల్ని పసిగడుతూ రాత్రి వేళల్లో తన ఆహారాన్ని సమకూర్చు కుంటాయి. మౌరి తెగలు, పురాతన యూరోపియన్లు వీటిని ఎక్కువగా పెంచుకునే వారు. వాటి వంటిలో ఉండే కొవ్వులోనే అధికశాతం శక్తిని కలిగుంటాయి కొకాపొలు. మగ పక్షులు దాదాపు 24 అంగుళాల పొడవు, 2కెజిల బరువుంటాయి. రెండు మూడు మైళ్లని తేలిగ్గా ప్రయాణించి ఆహారానిన సమకూర్చుకుంటాయి కొకాపొలు. 90 ఏళ్ల నుండి జీవించి ఉన్న అతి పురాతనమైన కొకాపొలు ప్రస్తుతం అంతరించి పోతున్న పక్షిజాతిగా నమోదయ్యాయి. 2012లో వీటి సంఖ్య 123కి చేరుకోవడంతో న్యూజిలాండ్ ప్రభుత్వం వాటిని పరిరక్షించే ప్రక్రియను మొదలు పెట్టింది. ✦

పదవికాసం – 19

కూర్పు: టి.డి. ప్రసాద్

1	2	3		■	4	5	6		■
7			■	8				■	9
10		■	11		■		■	12	
	■	13		■	14	■	15		
■	16		■	17			■	18	
19		■	20			■	21		■
■	22	23			■	24		■	25
26	■	27		■	28		■	29	■
■	30		■	31		■	32	■	33
34		■	35				■	36	

ఆధారాలు

అడ్డం

1. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన నాట్యం (4)
4. క్యూబా విప్లవ యోధుడు (4)
7. అమ్మలు (3)
8. ఆదుకోవడం (4)
10. అంగులి (2)
11. మాది కాదు (2)
12. కరకర సగమే అంది (2)
13. ప్రజలు (2)
15. చివర్లో ఉండని దండం (3)
16. -- తీసి గట్టుమీద పెట్టు (2)
17. జూనియర్ ఎన్టీఆర్ ముద్దుపేరు (3)
18. నీళ్లు (2)
19. సినిమాలో స్త్రీ పాత్రధారి (2)
20. క్రీస్తు పూర్వం తర్వాత (3)
21. ధైర్యానికి వ్యతిరేకం (2)
22. గారడి, ఇంద్రజాలం (4)
24. జీవితంలో సగ భాగం దీనికే సరిపోతుంది (2)
25. తప్పకుండా పాసయ్యావు ఐదులో (1)
26. ఇక విరల్‌తో కలిసి కూర్చునే గది నాలుగోది (1)
27. నోటిలో ఊరే లాలా-- (2)
28. హరిశ్చంద్రుని నోట వచ్చేది (2)
29. ఎనభై ఐదు శాతం మార్కులు రావాలి ఆరులో (1)
30. ఇది ముదిరి ఊసరవెల్లి అయినట్లు (2)
31. ఫుట్‌బాల్‌లో ఇది కొడితే పాయింటే (2)
32. అడ్డం 25,26,29 కలిపితే అది విద్యాలయం (1)
34. టాటా తర్వాత చెప్పేది (2)
35. రాబందు మరో పేరు (4)
36. వంక కర్రతో బంతిని గోల్ వైపు కొట్టే ఆట (2)

నిలువు

1. దగ్గర దూరాన్ని ఇలా అంటారు (4)
2. తూట్లు, రంధ్రాలు (3)
3. మహిళలు తలల్లో పెట్టుకునేవి (2)
4. బియ్యం దీనిలో పోసి చెరుగుతారు (2)
5. రోజాపువ్వు (3)
6. చివరి వరకు లేని వేడుక (2)
8. జూనియర్ ఎన్టీఆర్ నటించిన సినిమా, ఇద్దరు వర్ధమాన హీరోల పేర్లు (3)
9. ధిక్కారం (4)
11. మత్స్యం, ఒక రాశి (2)
12. మనోహరం, ఇంపైనది (4)
13. క్రికెట్లో ఆడే అందర్నీ కలిపి అంటారు (2)
14. పులకరం, ఫీవర్ (3)
16. గజిబిజి ఒకటో నంబరు (3)
17. తనఖా, కుదువ (3)
20. గ్రహం నుంచి జారిపడే ముక్క (3)
21. రవితేజ, మీరాజాస్మిన్, బోయపాటి శ్రీను కాంబినేషన్లో 2005లో వచ్చిన సినిమా (2)
23. పన్నెండే పైకి (3)
24. సదా (2)
27. వనితలు తమ కురులను వంపులు తిప్పుతూ అల్లుకునేది (2)
28. గతి తప్పిన బాసలు (3)
30. వందకు రెండైదులు తక్కువ (2)
31. అబద్ధమాడితే ఇది కట్టినట్లు ఉండాలంటారు (2)
33. వాయసం (2)

సుడోకు

	6	7		8	9			
8			2		6			
				7		6	5	
	5	6	8	1		9		7
	8		5		7		3	
2		1		4	3	5	8	
	9	4		2				
			7		5			4
			4	3		8	6	

గతవారం జవాబులు

2	6	1	9	3	4	5	7	8
8	9	4	1	7	5	3	6	2
5	3	7	6	2	8	1	9	4
9	2	8	3	5	6	7	4	1
1	5	3	2	4	7	9	8	6
7	4	6	8	1	9	2	3	5
6	7	9	5	8	2	4	1	3
4	1	5	7	6	3	8	2	9
3	8	2	4	9	1	6	5	7

1 డ్యా	2 ము	లు	■	3 ప	డ	4 వ	■	5 కు	6 ఆ
7 మే	రా	■	8 సు	త్తి	■	9 సు	డి	■	ష్ట
జి	■	10 స	న్మం	■	11 బు	ధ	■	12 తే	జ
■	13 జ	గం	■	14 అ	గ్గి	■	15 ఆ	మ	ని
16 చె	గ	■	17 బ	పా	■	18 సు	స్తీ	■	■
19 ము	ఠి	20 లే	క	పే	■	ఖం	■	21 స్నా	నం
ట	■	22 త	పా	■	23 వ	■	24 లో	త	■
■	25 ఆ	వ	■	26 డ	■	27 లం	చం	కో	28 సం
29 ఐ	పి	య	ల్	■	30 దె	■	31 వ	త్స	రం
32 పు	లు	సు	■	33 ఖు	■	34 ఆ	క	పం	తి

ముద్దుబిడ్డ

ఎలుగుబంటిని పెంచడం తెలుసు కానీ, ఇలా వాణ్నో కుటుంబ సభ్యుడిగా చూసుకుంటూ లివింగ్ స్పేస్‌లోను సోఫా ఎక్కించేయడం వేరు. రష్యా రాజధాని మాస్కోకు చెందిన యురీ పాటెలీంకో, స్వెట్లానా దంపతులకు వీడు ముద్దు బిడ్డ. కన్నబిడ్డలా లాలిస్తున్నారు ఈ ఎలుగుబంటిని. కన్నబిడ్డ అని ఎందుకనాలంటే.. మూడు నెలల వయస్సున్నపుడు అడవిలో గాయాలతో కనిపించిన వీడి పరిస్థితికి వారు కరిగిపోయారు. అప్పటి నుంచి వాడి బాగోగులన్ని వారే చూసుకున్నారు. ఇప్పుడు 23వ పుట్టిన రోజు జరుపుకున్నాడు స్టెపాన్. అన్నేళ్లపాటు వారితో కలిసిపోయిన స్టెపాన్ మొక్కలకు నీరు పట్టడం, పేపర్ చేతికందించడం వంటివి చేస్తాడు. టీవీ చూడటమంటే విపరీతమైన ఇష్టమట. యురీ, స్వెట్లానాతోనే కాదు ఇరుగు పొరుగుతోను మంచి సంబంధాలే ఉన్నాయి. చుట్టుపక్కల వారితో సీరియెస్‌గా ఫుట్‌బాల్ ఆడతాడు కూడా. గేమ్‌లో టీమ్ ఓడిపోయినా కోపంతో ఎవరినీ గాయపరిచింది లేదు. పెద్దోడయ్యాక ఇంటికి ప్రయోజకుడిలా మారాలి కదా. అందుకే సినిమాలు, టీవీ కార్యక్రమాల ఫొటోషూట్‌లతో బిజీబిజీగా కెరీర్‌లో దూసుకుపోతూ మంచి పేరు సంపాదించేస్తున్నాడు.

కలా వస్తువు

మనిషి ఆలోచనలు, కలలు మనసును దాటి బయట పడితే.. వాటిని మనం కళ్లారా చూడగలిగితే..! జెనెవీవ్ బెల్లెహూమియర్ బృందం చేసిందిదే. తొమ్మిది దృక్కోణాల్ని తీసుకుని పొట్రెయిట్‌లుగా మలిచిందీ కళా బృందం. శిల్పాన్ని, ఫొటోగ్రఫీని అనైస్ ఫాబెర్ట్ చూసుకుంటే.. ఫొటో ఎడిటింగ్‌ను జెనెవీవ్ చేశారు. మేరీ ఒస్సా కురులకు సొబగులు అద్దితే.. క్రిస్టినా పిలెగ్గీ ముఖారవిందాన్ని అర్థవంతంగా వేశారు. చుక్కల ప్రతిబింబాల్లో నావలో మెల్లిగా సాగిపోయే వెన్నెల రాత్రుల కలలు ఒకరివి. అలల లయలో సర్ఫ్ చేయాలనే కోరికలు మరొకరివి. ఒకరి ఆలోచనల ఉధృతి తుఫాన్‌లా మారితే, మరొకరి గుండెలోని వ్యథ అగ్నిపర్వతంలా పేలుతుంది. ఒక్కొక్కరిదీ ఒక్కో కలా వస్తువు. అదే ఈ బృందం కథా వస్తువు.

Check List

Book Number	KNSR02B145	Date	03/09/22
Front Cover	yes	Back Cover	yes
Blank Pages	NO		
Missing Pages	NO		
Prepared By	Mouni	Cutting By	Mouni
Scanned By	Shameera	Pages	29